నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
శనివారం | మార్చి 22, 2025 | www.navatelangana.com

శ్రీ కాలభైరవ స్వామి హుండీ లెక్కింపు



నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఇసన్నపల్లి(రామారెడ్డి)లో వెలసిన శ్రీ కాలభైరవ స్వామి ఆలయ హుండీ లెక్కింపును శుక్రవారం నిర్వహించారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ విజయ రామారావు ఆధ్వర్యంలో 52 రోజుల నుంచి స్వామివారికి కానుకగా రూ.2,62,758 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ప్రభు రామచంద్రం తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, పూజారి శ్రీనివాస్ శర్మ, సిబ్బంది నాగరాజు, కాలభైరవ స్వామి సేవాసమితి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తత అవసరం

నవతెలంగాణ-రామారెడ్డి

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తత అవసరమని ఎస్ఐ నరేష్ ప్రజలకు సూచించారు. శుక్రవారం అవగాహన కల్పించిన ఆయన మాట్లాడుతూ.. సైబర్ మోసగాళ్ల నుంచి కుటుంబ సభ్యులు జైల్లో ఉన్నారని, ఆస్పత్రిలో ఉన్నారని ఫేక్ కాల్ చేసి డబ్బులు కాజేస్తున్నారని, లాటరీ తగిలిందని, లోను మంజూరైందని ఎరవేసి డబ్బులు కాజేస్తున్నారని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో బ్యాంకు వివరాలను గుర్తుతెలియని వ్యక్తులకు తెలుపవద్దని, ఎవరైనా తెలియని వ్యక్తులు ఫోన్ చేసి భయభ్రాంతులకు గురిచేసినా, వివరాలను అడిగినా తెలపవద్దని అన్నారు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే లింకులను తాకవద్దని, ఓటిపిలను చెప్పవద్దని సూచించారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల వలలో చిక్కితే సైబర్ క్రైమ్ నెంబర్1930కు గాని పోలీస్ స్టేషన్లో గాని ఫిర్యాదు చేయాలని సూచించారు.

అకాల వర్షం..
అన్నదాత ఆగం..



తాడ్వాయి : విరిగిపడిన చెట్టు

- ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో వాన
- ధర్పల్లి మండలంలో వడగండ్లు
- నేలరాలిన వరి ధాన్యం..
- తడిసిన మొక్కజొన్న, పసుపు



లింగంపేట్ : పిడుగుపాటుతో మృత్యువాతపడిన గేదె



ధర్పల్లి: నేలరాలిన వడ్లు

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఉన్నట్టుండి ఉరుములతో కూడిన అకాల భారీ వర్షం కురిసింది. దీంతో మొక్కజొన్న, పసుపు పంటను ఆరబెట్టిన రైతులు కొంత ఇబ్బందులు పడ్డారు.

ధర్పల్లి : మద్దుల్‌తండా, వాడి, సీతాయిపేట్, హొన్నాజీపేట్ గ్రామాల్లో గాలిదుమారంతో కూడిన వడ్లగండ్ల వాన పడింది. దీంతో కోతకు వచ్చిన వరి పంట దెబ్బతింది. కోతదశలో వరి ధాన్యం గింజలు రాలిపోయాయి. కొంతమేర పంట నేలవాలింది. భూగర్భ జలాలు ఎండిపోవడంతో రైతులు ట్యాంకర్ల ద్వార పంటను కాపాడుకుంటున్నారు. ఈ సమయంలో వడగండ్ల వాన, గాలిదుమారానికి కోతదశలో వరి నేలరాలింది. మరో పదిరోజుల్లో కోత కోసే సమయంలో పంట దెబ్బతిందని రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.

వర్షానికి తడిసిన ధాన్యం..

మెండోరా : గురువారం రాత్రి కురిసిన వర్షానికి మొక్కజొన్న, పసుపు పంట తడిసి ముద్దయ్యింది. ధాన్యాలకు ధరలు రోజురోజుకు పడిపోతుండడంతో ఎప్పుడెప్పుడు విక్రయించుకోవాలని ఎదురుచూస్తున్న రైతుల ఆశలు అడియాసలయ్యాయి. రోడ్లపై ఆరబోసిన ధాన్యాన్ని నేర్పుతూ నేలను ఆరబెడుతూ ధాన్యాన్ని అటు ఇటు జరుపుకుంటూ కుప్పలుగా పోసుకుంటూ ఆరబెట్టుకుంటున్నారు.

లింగంపేట్ : మండలంలో శుక్రవారం సాయంత్రం వర్షం కురిసింది. వాతావరణంలో మార్పులు రావడంతో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ఒకేసారి వాతావరణం చల్లబడింది. శుక్రవారం సంతకావడంతో వర్షంలో విక్రయాలు సక్రమంగా జరగపోవడంతో వారం సంత బురదతో సందడిగా మారింది. కొందరు ఇండ్లకే పరిమితమయ్యారు.

పిడుగు పడి రెండు గేదెలు మృత్యువాత..

మండలంలోని లింగంపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం సాయంత్రం పిడుగు పడి రెండు గేదెలు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. లింగంపల్లి గ్రామానికి చెందిన సాకలి సాయిలు, గాలెం నారాయణకు చెందిన గేదెలు రోజువారీగా గ్రామ సమీపంలోని చెరువు వద్ద మేపుతున్నారు. ప్రమాదవశాత్తు ఉరుములు మెరుపులు రావడంతో మేత మేస్తున్న రెండు గేదెలపై పిడుగు పడడంతో గేదెలు అక్కడికక్కడే మృత్యువాతపడ్డాయి.

రామారెడ్డి : మండలంలోని వివిధ గ్రామాల్లో వర్షం కురిసింది. కురిసిన వర్షంతో ఎండుతున్న పొలాలకు జీవం పోసింది. ఒక్కసారిగా కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడటంతో వేడిమి నుండి ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

నాగిరెడ్డిపేట్ : మండలంలో అకాల వర్షం కురవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఈదురుగాలులు మొదలయ్యాయి. చినుకులుగా ప్రారంభమై.. ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. పంట చేతికి వచ్చే సమయంలో వర్షాలు కురవడంతో ఏమీ చేయాలో అర్థం కాని పరిస్థితిలో రైతులు దిగులు చెందుతున్నారు.

తాడ్వాయి : మండల కేంద్రమైన తాడ్వాయిలో అకాల వర్షానికి చెట్టు విరిగి విద్యుత్ వైర్లపై పడ్డాయి. దీంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది.

సీపీఐ(ఎం), ప్రజా సంఘాల నాయకుల
అక్రమ అరెస్టులపై ఖండన





అరెస్టయిన సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు, నూర్జహాన్, పెద్దివెంకట్రాములు

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు

నవతెలంగాణ-కంఠేశ్వర్

అర్ధరాత్రి నుంచి సీపీఐ(ఎం) కార్యకర్తలను, ప్రజాసంఘాల నాయకులను అక్రమంగా అరెస్టులు చేసి నిర్బంధించటం ఏ రకంగా ప్రజాస్వామ్య పాలన అవుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పే ప్రజాస్వామ్య పాలన ఇదేనా అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు ప్రశ్నించారు. శుక్రవారం నగరంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్ధరాత్రిలో సీపీఐ(ఎం), ప్రజా సంఘాల నాయకులను అరెస్టులు చేసి వివిధ ప్రాంతాల్లో పోలీస్ స్టేషన్లో నిర్బంధించారని వారు తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శి అయిన రమేష్ బాబు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్‌లను పోలీసుల చేత గృహనిర్బంధంలో బంధించారని, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్‌రాములను ఐదవ టౌన్ పోలీస్‌స్టేషన్లో నిర్బంధించారని, సిఐటియు శంకర్ గౌడ్‌ను బోధన్ పోలీస్ స్టేషన్లో నిర్బంధించారని, అదే విధంగా సిఐటియు నాయకులు ఈవీఎల్ నారాయణ, కటారి రాములును నాలుగో టౌన్ పోలీస్ స్టేషన్లో, శ్రీనివాస్, దేవేందర్‌ను నవీపేట్‌లో అర్ధరాత్రులు అరెస్ట్ చేసి నిర్బంధించారని వారు తెలిపారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా పెట్టిన బడ్జెట్ ప్రసంగంలో ఈ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల పథకంలో భాగంగా ఇచ్చిన హామీల అమలుకు నిధులు కేటాయించకపోవడంతో తమ సమస్యల పరిష్కారం కోసం ఆయా ప్రజా సంఘాలు తమ నిరసనను వెలిబుచ్చటానికి చలో హైదరాబాద్‌కు పిలుపునిస్తే దాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రజల సమస్యలపై నిరంతరం గొంతెత్తి మాట్లాడే పార్టీ కార్యకర్తలను ప్రజాసంఘాల నాయకులను అక్రమంగా నిర్బంధించటం మూలంగా ప్రజలు మర్చిపోతారనుకుంటే సరైంది కాదని గతంలో బీఆర్ఎస్ పార్టీ ఏ విధంగా ప్రజా ఉద్యమాలను నిర్బంధం ద్వారా అణచాలని చూస్తే ఏ గతి పట్టిందో అందరికీ తెలుసని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అదే పద్ధతి పాటిస్తే కాంగ్రెస్ పార్టీ పాలకులు కూడా ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ప్రజా సమస్యలపై మాట్లాడే వెలిబుచ్చే అవకాశం కల్పించకుండా ప్రజా పాలన అని చెప్తూ మాయచేయడం సరైందని కాదని వారు అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిర్బంధ చర్యలను మానుకొని ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం బడ్జెట్లో సవరణలు తీసుకొచ్చి అక్రమంగా అరెస్టులను ఉపసంహరించుకోవాలని అన్నారు. ప్రజా పోరాటాలను అణిచివేయడంలో గత ప్రభుత్వం చేసిన విధంగానే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.



అరెస్టయిన నవీపేట్ నాయకులు

ప్రారంభమైన పది పరీక్షలు

- పరీక్ష కేంద్రాలను సందర్శించిన ఉమ్మడి జిల్లా కలెక్టర్లు

నవతెలంగాణ-ఆర్మూర్/కామారెడ్డి



ఆర్మూర్ : మాట్లాడుతున్న కలెక్టర్

పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పట్టణంలోని పలు పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తనిఖీ చేశారు. విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. మహాత్మ జ్యోతిబాపూలే హాస్టల్‌ను తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రాజాగౌడ్, తదితరులు ఉన్నారు.



కామారెడ్డి: వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

కామారెడ్డి : పదవ తరగతి వార్షిక పరీక్షలు మొదటి రోజున ప్రశాంతంగా జరిగాయని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని గౌతమ్ ఉన్నత పాఠశాల కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. పరీక్ష కేంద్రంలోని తరగతి గదులను పరిశీలించారు. మాల్ ప్రాక్టీస్ జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 64 కేంద్రాల్లో 12,579 మంది విద్యార్థులకు గాను, 12,552 మంది విద్యార్థులు పరీక్ష రాశారని, 27 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. కలెక్టర్ వెంట కామారెడ్డి తహసీల్దార్ జనార్ధన్ ఉన్నారు.

కేసులు పెండింగ్‌లో లేకుండా చూడాలి
శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలి

- ఎస్పీ రాజేష్ చంద్ర

నవతెలంగాణ-దోమకొండ/కామారెడ్డి

పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ రాజేష్ చంద్ర పోలీసులకు సూచించారు. దోమకొండ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని పనిచేసే విధంగా చూడాలని, నేరాల నియంత్రణకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. కేసులు పెండింగులో లేకుండా ఎప్పటికప్పుడు వెంటనే ఆన్లైన్లో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో క్రైమ్ రేటు వివరాలను, సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు. నూతనంగా వీధుల్లో చేరిన కానిస్టేబుళ్లకు పలు సూచనలు చేశారు. పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగేటట్లు చూడాలని పోలీసులకు సూచించారు. అనంతరం దోమకొండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఐ సంపత్ కుమార్, ఎస్సై స్రవంతి, సిబ్బంది ఉన్నారు.

పది పరీక్ష కేంద్రాలను సందర్శించిన జిల్లా ఎస్పీ..

కామారెడ్డి : కామారెడ్డి జిల్లా ఎస్పీ యం.రాజేష్ చంద్ర, ఐపీఎస్ పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కావడంతో శుక్రవారం జిల్లా కేంద్రంలోని పరీక్ష కేంద్రాల సందర్శించారు. అలాగే బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించి సిబ్బందికి కీలక సూచనలు చేశారు. కామారెడ్డి పట్టణంలోని బాయ్స్ హై స్కూల్, దోమకొండ బాయ్స్ హైస్కూల్ పరీక్షా కేంద్రాలను సందర్శించి, అక్కడి భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. పరీక్షా సమయంలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్‌ను సమర్థంగా నియంత్రించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, అలాగే శాంతి భద్రతల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు సిబ్బందికి సూచించారు. ఎస్పీతో పాటు కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి, టౌన్ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ తిరుపయ్య, సిబ్బంది తదితరులున్నారు.

ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రావొద్దు

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ

ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలతో నీటి సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్‌తో కలిసి కామారెడ్డి పట్టణం, నియోజకవర్గంలో తాగునీటి సమస్యపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి సమస్యలు రాకుండా చూడాలని తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. సమస్యలు ఉత్పన్నం కాకముందే ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. కామారెడ్డి మున్సిపల్ ఏరియాలో అవసరం మేరకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని సూచించారు. మిషన్ భగీరథ, మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖల ద్వారా చేపడుతున్న పనులపై ఆయన సమీక్షించారు. మిషన్ భగీరథ ద్వారా చేపట్టే పైప్‌లైన్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. మున్సిపల్ ఏరియాలో రోజుకు రెండుసార్లు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పట్టణంలో 33/11 కే.వి. అండర్ గ్రౌండ్ సబ్ స్టేషన్ నిర్మాణానికి అవసరమైన భూమిని గుర్తించి కేటాయించాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ.. తాగునీటి అవసరాలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, గ్రామ పంచాయతీ నిధులను వినియోగించుకోవాలని, అవసరమేరకు ఉన్నతాధికారులకు వివరించి నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. కామారెడ్డి పట్టణంలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని, రంజాన్ పండుగ నేపథ్యంలో రోజుకు రెండుసార్లు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పట్టణంలో 33/11 కే.వి. సబ్ స్టేషన్ కోసం అవసరమైన భూమిని గుర్తించాలని అదనపు కలెక్టర్‌కు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు వి.విక్టర్, శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి, మిషన్ భగీరథ, పంచాయతీ రాజ్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు లబ్ది చేకూర్చాలనే
ఎస్సీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాం

- ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

నవతెలంగాణ-బోధన్/రెంజల్



బోధన్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అన్ని వర్గాల ప్రజలకు సమానంగా సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ అమలు చేయడానికి చట్టబద్ధత కల్పించినట్టు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం సాలూర మండల పరిషత్ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. సాలూర మండల పరిషత్ ఆఫీసులో అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా అధికారులు విధులు నిర్వహించాలని సూచించారు. అలాగే బోధన్ నిజాంషుగర్ ఫ్యాక్టరీని తెరిపించడమా, కొత్తది నిర్మించడమా అనే దానిపై చెరుకు పంట సాగులో మెళుకువలు తెలుసుకోవడానికి ఈ ప్రాంత రైతులు మహారాష్ట్ర ప్రాంతంలో పర్యటించారని తెలిపారు. కావున రైతులు లాభదాయకం పంటలు పండించాలన్నారు. మహిళ సంఘాలకు ప్రభుత్వం వడ్డీలేని రుణాలు అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సాలూర లిఫ్ట్ తన హయాంలోనే నిర్మితమైందని గుర్తు చేశారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి వారిని ఎన్నుకోవాలని, స్వార్ధ పరులకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ సాయగౌడ్, సాలూర ఎంపీడీఓ శ్రీనివాస్, బోధన్ ఎంపీడీఓ బాలగంగాధర్, తహశీల్దార్ శశిభూషణ్, ఏళ్ల సంతోష్, శ్వేత, కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగాశంకర్, అల్లె రమేష్, అల్లె జనార్ధన్, సురేష్, దండోర సంఘం నాయకులు సుభాష్, రవి, లాలయ్య, మంధర్న నాగురావు, దిలీప్, మాజీ ఎంపీటీసీ రమేష్ ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..

రెంజల్ : రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వ్యవసాయ ప్రాధాన్యతపై దడష్టి సారించిందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బోధన్ ఎమ్మెల్యే పి సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మొబిన్ ఖాన్, తహసిల్దార్ శ్రవణ్ కుమార్, జి.సాయిరెడ్డి, సాయిబాబాగౌడ్, సురేందర్‌గౌడ్, జావిద్ ఉద్దీన్, ధనుంజయ, ఎంఎల్ రాజు, ఇందిరాదేవి, ఎంపీ ఫోర్ రఫీ హైమద్, సాయాగౌడ్, గంగా కృష్ణ, ఫుర్ఖాన్, ఏవో శ్రీనివాసరావు, కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు గైని కిరణ్, సంతోష్, శ్రీకాంత్, సయ్యద్ సల్మాన్, రాకేష్, గైని సాయిలు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు భిక్కనూర్ తైబజార్ వేలం

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక అధికారి, ఎంపీడీవో రాజ్ కిరణ్ రెడ్డి ఆధ్వర్యంలో తై బజార్ వేలం శనివారం నిర్వహించనున్నట్టు పంచాయతీ కార్యదర్శి మహేష్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

సాటాపూర్ తైబజార్ వేలంపాట వాయిదా

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ తై బజార్ వేలం పాట వాయిదా పడినట్లు గ్రామ కార్యదర్శి మహబూబ్ అలీ తెలిపారు. ఈ వేలం పాటకు ఎవరూ రాకపోవడంతో తిరిగి ఈ నెల 25న వేలం పాట నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపీఓ రఫీ హైమద్, బిల్ కలెక్టర్ అశోక్, సిబ్బంది ఉన్నారు.

ఉస్మానియాలో పోరాటాలు చేయొద్దన్న
సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలి

- హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను రేవంత్ సర్కార్ వేలం వేయడం సరికాదు
- ఎస్ఎఫ్ఐ డిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఉస్మానియాలో పోరాటాలు చేయొద్దన్న సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలని, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను రేవంత్ సర్కార్ వేలం వేయడం సరికాదని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఐటిఐ కళాశాల ముందు రేవంత్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్ మాట్లాడుతూ.. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పోరాటాలు, నినాదాలు చేయవద్దని రిజిస్ట్రార్‌చే జీవో జారీ చేయడం అప్రజాస్వామికమని అన్నారు. ఈ జీవోను వెనక్కి తీసుకోవాలని పోరాటాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐపై కేసులు పెట్టి అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని అన్నారు. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజా పాలన పేరుతోనే అభివృద్ధి చేస్తామని ఉద్యమాలను అణచివేయడం సరికాదని రేవంత్ సర్కార్‌కు హితవు పలికారు. అదేవిధంగా అక్రమంగా అరెస్టులు చేసిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్ మూర్తి బృందాన్ని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన 400 ఎకరాల భూములను ప్రభుత్వం విక్రయించడం సరికాదని వెంటనే ఉపసంహరించుకోవాలని లేకపోతే భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు దినేష్, నగర నాయకులు రాజు, ఐటిఐ కళాశాల అధ్యక్షులు వికాస్, సాయి, రోహిత్, నరేష్, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదస్థలాన్ని పరిశీలించిన ఏఎస్పీ



ప్రమాదస్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని బస్వాపూర్ గ్రామంలో రెండు రోజుల క్రితం పల్లె దావఖాన నిర్మాణ పనులలో విద్యుత్ షాక్ తగిలి సెంట్రింగ్ పనులు చేసే కూలీ మరణించిన నేపథ్యంలో విషయం తెలుసుకున్న ఏఎస్పీ చైతన్యరెడ్డి శుక్రవారం గ్రామంలోని ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను, వివరాలు సేకరించారు. అనంతరం పదవ తరగతి పరీక్ష కేంద్రాలను పరిశీలించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు నిర్వహించాలని చీఫ్ సూపరింటెండెంట్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఇందూరు తిరుమలలో బ్రహ్మోత్సవాలు



నవతెలంగాణ-మోపాల్

మోపాల్ మండల కేంద్రంలో గల నర్సింగ్ పల్లి గ్రామంలోని ఇందూరు తిరుమల క్షేత్రంలో బ్రహ్మోత్సవాలో భాగంగా రెండవ రోజు శుక్రవారం యజ్ఞశాలలో పాంచాహ్నిక హవన కార్యక్రమంలో నిర్వహించినట్టు గంగోత్రి రామానుజ స్వామి తెలిపారు. గరుడధ్వజాన్ని ఎగురవేసినట్టు యజ్ఞాచార్యులు శిఖామణి స్వామి చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు ప్రముఖ నిర్మాత దిల్ రాజు, నరసింహారెడ్డి, విజయసింహారెడ్డి, నర్సారెడ్డి, నరాల సుధాకర్ ప్రసాద్, రాజేశ్వర్, రమేష్, సాయిలు, భాస్కర్ మురళి, చిన్నయ్య, గంగారెడ్డి, నరేష్ ,సురేష్ పాల్గొన్నారు. యజ్ఞాచార్యులు ఆచార్య శిఖామణి స్వామి, శ్రీఖర్ ఆచార్య, స్వామి రోహిత్ కుమారాచార్యులు, విజయ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు పంపిణీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

పి. శంకర్ ఎఆర్ కానిస్టేబుల్-పోలీస్ హెడ్ క్వార్టర్స్-సారంగపూర్ వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించారు. గ్రూప్ పర్సనల్ యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ రూ.5లక్షల చెక్కు శుక్రవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమీషనర్ పి. సాయి చైతన్య, శంకర్ సతీమణి విజయకు అందజేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ అదనపు డిసిపి (అడ్మిన్) జి. బస్వారెడ్డి, అదనపు డిసిపి (ఎఆర్) కె. రామచంద్రరావు, ఎఓ అనిసాబేగం, రిజర్వు ఇన్‌స్పెక్టర్ (వెల్ఫేర్) శ్రీనివాస్, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంటు షకిల్‌భాష డిపిఓ సీనియర్ అసిస్టెంటు పి. రాజేశ్వర్ వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న కమిషనర్

బిఎస్ఎన్ఎల్ బంగారు గంగారాంకు సన్మానం



గంగారాంను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రతిరోజు గుడికి వెళ్లి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బిఎస్ఎన్ఎల్ బంగారు గంగారంకు కమిటీ సలహాదారులు భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బిఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగి అయిన బిఎస్ఎన్ఎల్ గంగారం వీవీ నగర్ కాలనీ వాసులు. సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలనే ఉద్దేశంతో సాయిబాబా కమిటీలో చేరి ప్రతీ రోజూ గుడికి వెళ్లి సేవాకార్యక్రమాలు చేస్తున్నారు. అందులో భాగంగా గుడిలో నిర్మాణం చేస్తున్న భోజనశాలకు తన సేవలు అందించారు. వాటిని గుర్తించిన కమిటీ సలహాదారు భూపాల్ రెడ్డి, కమిటీ అధ్యక్షులు రాజేందర్ రెడ్డితో చర్చించి మధ్యాహ్నా హారతి తరువాత భక్తుల సమక్షంలో ఘనంగా పూలమాలతో సన్మానించి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులను ఖండిస్తున్నాం..

- నిజామాబాద్ జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షులు కట్టారి రాములు



అరెస్టు చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ అర్బన్‌లో ప్రజా సంఘాల నాయకులను బుధవారం అర్ధరాత్రి ముందస్తుగా అరెస్టు చేయడాన్ని ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు కట్టారి రాములు తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం రవాణా రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, మహాలక్ష్మి స్కీమ్ ద్వారా ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి ఇస్తానన్న రూ .12వేలు వెంటనే ఇచ్చి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్‌తో శుక్రవారం చలో హైదరాబాద్ ఇందిరాపార్క్ దగ్గర ధర్నా కార్యక్రమం తలపెట్టా రన్నారు. ఈకార్యక్రమానికి వెళ్లకుండా అక్రమ అరెస్టులు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తులో ఆందోళనా కార్యక్రమాలు తప్పవని అన్నారు.

వాలీబాల్ పోటీల్లో రూ. 30 వేల బహుమతి గెలుచుకున్న ప్రియాంక



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఆ కళాశాల చదువు కోసమే కాదు... అన్ని రంగాల్లోనూ విద్యార్థుల్ని రాటుదేల్చుతుంది. అన్నింటా అగ్రగామిగా నిలుపుతుంది. చక్కని బోధన.. శిక్షణతో తెలంగాణ యూనివర్శిటీలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. అదే నిజామాబాద్ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల. ఇటీవల ద్వారా న్యాక్ ద్వారా బీ ప్లస్ ప్లస్ హోదా దక్కించుకున్న ఆ కళాశాల ఇప్పుడు క్రీడల్లో సాటిలేని మేటిగా నిలిచింది. తెలంగాణ రాష్ట్ర స్థాయి అండర్ 19 వాలీబాల్ పోటీల్లో కళాశాలకు చెందిన దేగావత్ ప్రియాంక అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. ఫలితంగా రూ. 30 వేల నగదు బహుమతిని సొంతం చేసుకుంది. రెండు రోజులుగా రంగారెడ్డి జిల్లాలోని దేవుని పడకల్‌లో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు జరుగుతున్నాయి. నిజామాబాద్ కళాశాలలో బీబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న ప్రియా ంక ఈ పోటీలకు ఎంపికైంది. టోర్నమెంట్ మొత్తంలో ప్రియాంక అత్యుత్త మంగా కొనసాగింది. రెఫరీలు ఆమెకు ఉత్తమ క్రీడాకారిణిగా గుర్తిస్తూ అండర్-19 విభాగంలో రూ.30వేల నగదును బహుమతి ఇచ్చారు.

పారంభమైన పదో తరగతి పరీక్షలు



నవతెలంగాణ-భీంగల్ రూరల్

పదోతరగతి పరీక్షలకు భీంగల్ మండల కేంద్రంలో నాలుగు సెంటర్లు కాగా అందులో రెండు సెంటర్లు మున్సిపల్ పరిధిలో ఉన్నాయి. పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను గేటు వద్దనే హాల్ టికెట్ చెకింగ్ చేసి సెంటర్ లోనికి అనుమతించారు. పరీక్షల సమయం విద్యార్థులకు పరీక్ష సమయం 9:30 అయినా మొదటిరోజు కావడంతో పరీక్ష కేంద్రాల్లోనికి విద్యార్థులను 9 గంటల నుంచే అనుమతించారు. పరీక్షలు రాయడానికి లోనికి వెళ్లిన విద్యార్థులు మంచి ర్యాంకులతో బయటకు రావాలని విద్యాశాఖ అధికారి కోరారు. బోర్డు సూచించిన మార్గదర్శకాల ప్రకారం పరీక్షలు నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖ అధికారి ఎంఈఓ స్వామి తెలిపారు.

బొట్టు బొట్టు.. ఒడిసిపట్టు

- ప్రతి నీటి చుక్క బంగారమే..
- నీటిని వృథా చేస్తే అనర్థాలే..
- నేడు ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా



నవతెలంగాణ-ఆర్మూర్

నల్లకు బిరడా సరిగా లేకపోవడంతో నీరు వృథా. కాలువ సక్రమంగా లేకపోవడంతో నీటి వృథా.. తాగునీరైన, సాగునీరైనా ఎక్కడికక్కడే విచ్చలవిడిగా నీటిని వృథా చేస్తున్నారు. మనుషులకు సకల జీవరాశులకు జైలమే ప్రాణదారం, జీవనాధారం. అలాంటి నీటి వృథాను అరికట్టడంలో ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. వృథాగా పోయేది ఒక నీటి చుక్కలే అని అనుకుంటే భవిష్యత్తు తరాల జీవనం కష్టమవుతుంది. భూగర్భ జలాలు అడుగంటుతున్న ప్రస్తుత తరుణంలో ఉన్న నీటి వనరులను కాపాడుకోవడం ఎంతో ముఖ్యం. ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉంటేనే నీటి వృథాను అరికట్టగలం. నేడు ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా నవతెలంగాణ ప్రత్యేక కథనం..

ప్రతి నీటి బొట్టును ఎంతో జాగ్రత్తగా...

నీరు సమస్త జీవకోటికి ప్రాణాధారం. నీటి జాడ ఉంటేనే సృష్టి మనుగడ సాగేది. లేకపోతే ప్రకృతి లేదు. ప్రకృతి ప్రసాదించిన అపారమైన సంపదలో నీళ్లదే అగ్రస్థానం. అంతటి ప్రాధాన్యత ఉన్న ప్రతి నీటి బొట్టును ఎంతో జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఎండలు ముదిరాయి. తాగునీటి అవసరాలు పెరిగాయి. భూగర్భ జలాలు అడుగంటాయి. పాతాళ గంగను పైకి తెచ్చేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. వందల కొద్ది అడుగుల లోతును తవ్వుతున్నారు. అవసరాలకు మించి విచ్చల విడిగా తోడేస్తున్నారు. ఉన్న నీటిని సక్రమంగా వాడుకోకుండా వృథా చేస్తున్నారు ఫలితంగా జల వనరులు తగ్గిపోతున్నాయి..

రెట్టింపు....

ఒకప్పుడు 20 ,30 అడుగుల లోతుల్లోనే భూగర్భ జలాలు ఉండేవి. నేడు వందల అడుగుల లోతు వేయడానికి కారణం మానవాళి చేసిన తప్పిదాలు, తాగు సాగు అవసరాల రూపంలో ఇష్టానుసారంగా తోడేస్తుండడంతో పెద్ద మొత్తంలో నీరు వృథాగా పోతుంది. వరల్డ్ వాచ్ ఇనిస్ట్యూట్ సర్వే ప్రకారం ప్రపంచంలో 50 శాతం తాగునీరు వృథా అవుతోంది. ప్రాజెక్టుల నుంచి విడుదల చేసే నీరు పెద్ద మొత్తంలో వృథాగా పోతుంది పట్టణాలతో పాటు పల్లెలకు వాటర్ ట్యాంకర్లు దిక్కు అవుతున్నవి .

పాతాళానికి భూగర్భ జలాలు...

గతంలో గ్రామీణ ప్రాంతాల్లో 30 ఫీట్ల లోతులో బావులు తవ్వుకొని నీటిని ఉపయోగించుకునేవారు. భూగర్భ జలాలు తగ్గడంతో వాటి స్థానంలో చేతి పంపులు వచ్చాయి. వంద ఫీట్ల వరకు బోర్లు వేసి చేతిపంపు బిగించి తాగు నీటిని అందించేవారు. ప్రస్తుతం భూగర్భ జలాలు మరింత అడుగంటి పోయాయి. సింగిల్ ఫేస్ మోటార్ల వినియోగం వృథా భారీగా పెరిగింది. చేతిపంపులకు మరింత లోతుగా బోర్లు వేసి ప్రజల తాగునీటి అవసరాలు తీరుస్తున్న 24 గంటల పాటు విద్యుత్ ఉన్నంతసేపు నిరంతరంగా మోటర్లు నడుస్తుండడంతో నీటి వృథాతో భూగర్భ జలాలు తగ్గుతున్నవి.

నల్ల నుంచి వృథాగా...

నల్లాలు ,పైపులైన్ లీకేజీలతో భారీగానే నీరు వృథా అవుతోంది. ఒక సెకనుకు ఒక బొట్టు నీరు కారిపోతే రోజుకు 15 లీటర్ల చొప్పున ఏడాదికి 5.320 లీటర్లు వృథాగా పోతుందని అంచనా. కుళాయిలను వదిలేయడంతో నీరు ట్యాంకుల్లో పొంగిపొర్లతో నీటి దుర్వినియోగానికి నిదర్శనం. గ్రామాల్లో ప్రధాన ట్యాంకుల నుంచి నీరు ఎక్కించే సమయంలో సిబ్బంది మర్చిపోవడంతో గంటల తరబడి ట్యాంకుల నుంచి నీరంతా వృథాగా పోతుంది.

వాల్టా చట్టం అమలెక్కడ....

వాల్టా చట్టం ప్రకారం ఎవరు బోరువేసిన సంబంధిత అధికారుల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. బోరుకు బోరుకు మధ్య దూరం పాటించాల్సి ఉంటుంది. కానీ ఈ నిబంధనలు ఎవరు పట్టించుకోవడం లేదు. బోర్లు వేస్తున్నారు. ఫలితంగా భూగర్భ జలాలు పాతాళంలోకి చేరుతున్నాయి . అలాగే ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల కొనసాగుతున్న ఇసుక క్వారీలతోనూ భూగర్భ జలాలు అడిగింటి వ్యవసాయ బోర్లు ఎత్తిపోతున్నవి.

ఉమ్మడి జిల్లాల్లో పరిస్థితి..

నీటి ఆవశ్యకతను, సరపరకు భారీ వ్యత్యాసం చోటు చేసుకుంటుంది. కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేసే సమయంలో నిర్దిష్ట సమయంలో లేకపోవడంతో ప్రధాన నీటి ట్యాంకుల నుంచి కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేసేటప్పుడు పైపులై లీకేజీ కారణంగా నీరంతా వృథాగా పోతుంది. అలాగే పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇంకుడు గుంతల ఏర్పాటు అమలు కాకపోవడం మరో కారణంగా చెప్పవచ్చు.

నీటి పొదుపు తప్పనిసరి..



పడాల్ మనోజ్, వ్యాపారి, ఆర్మూర్.

భూగర్భ జలాలు పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. నీటిని వృథా చేస్తే కలిగే దుష్పరిణామాలను ప్రజలు గ్రహించాలి. ఇంకుడు గుంతల ఏర్పాటులో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి.

ఇకనుంచి అయినా మేల్కోవాలి..



ఎం. యశస్విని, ఇరిగేషన్ ఎస్. ఈ, ఆర్మూర్.

నీటిని పొదుపు చేయకుంటే అనర్థమనే విషయాన్ని ప్రజలు గుర్తెరుగాలి. గ్రామాల్లో తాగునీటి కోసం ఇబ్బందులు ఎదురైన పరిస్థితి ఇలా ఉంటే భవిష్యత్తు తరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారనుంది. రానున్న రోజుల్లో జలసిరులు దొరకడమే గగనమవుతుంది. అందుకే ఇకనుంచైనా మేల్కొనాలి. నీటిని వృథా ను అరికట్టి భవిష్యత్తు తరాలకు అందించాలి.

కార్మికుల సమస్యలు పరిష్కరించమంటే అక్రమ అరెస్టులా?

- కాంగ్రెస్ సర్కార్‌కు అరెస్టులపైన ఉన్న దృష్టి కార్మికుల సమస్యలపై ఎందుకు లేదు.?
- సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని చలో హైదరాబాద్‌కు మహాధర్నను నిజామాబాద్‌నుండి వెళ్లనివ్వకుండా ముందస్తుగా అర్ధరాత్రి నుండి సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఏ రమేష్ బాబు, పెద్ది వెంకట్రాములు, ఈపీఎల్ నారాయణ, కటారి రాములు, తదితర నాయకులకు అరెస్టులు చేశారని నూర్జహాన్ శుక్రవారం తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో బిల్డింగ్ కార్మికులు , బీడీ కార్మికులు, ట్రాన్స్‌పోర్ట్, హామాలి, సెక్యూరిటీ గార్డ్స్ తదితర అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మహాధర్నకు పిలుపునిచ్చినట్టు తెలిపారు. పోలీసు యంత్రాంగం అతి ఉత్సాహ ంగా అర్ధరాత్రి నుండి ఈ మహా ధర్నాను అడ్డుకునేందుకు ఎక్కడికక్కడే సిఐటియు నాయకులను అరెస్టులు చేసి గృహనిర్బంధం చేస్తూ పోలీస్ స్టేషన్లో నిర్బంధించడం నిరంకుశ పాలనకు నిదర్శనమని విమర్శించారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక వర్గ సమస్యలు పరిష్కరించకుండా కార్మిక నేతలను అరెస్టు చేయడం దారుణమని విమర్శించారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక నేతలను అరెస్ట్ పైన ప్రభుత్వం దృష్టి పెట్టడం కంటే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కనీస వేతనాల జీవోలను గెజిట్ చేయాలి

- రేపు కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో
- హైదరాబాదులో జరిగే ధర్నాను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న టీయూసీఐ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కనీస వేతనాల 5 జీవోలను గెజిట్ చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు ఈనెల 22న ఇందిరాపార్క్ వద్ద తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శ్రామిక భవన్, కోటగల్లిలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో అసంఘటిత కార్మిక వర్గం కోటి మంది పైగా ఉన్నారని, పెరిగిపోతున్న ధరలతో చాలీచాలని జీతాలతో సతమతమవుతున్నా రన్నారు. 2021లో ఆనాటి కేసీఆర్ ప్రభుత్వం 5 కనీస వేతనాల జీవోలకు ఫైనల్ నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. కనీస వేతనాల సలహా మండలిలోగల ప్రభుత్వం, యజమాన్య, కార్మిక సంఘాల ప్రతినిధుల మధ్య సుదీర్ఘ చర్చల అనంతరం జీవోలను ఫైనల్ చేశారని తెలిపారు. ఆ జీవోలను ప్రభుత్వం గెజిట్ చెయ్యాలన్నారు. ఆ జీవోలకు నేటికీ గెజిట్ ముద్రించకపోవడం సిగ్గుచేటైన విషయన్నారు. మరో 12 జీవోల ఫైనల్ నోటిఫికేషన్ ప్రభుత్వానికి, ఆనాటి కనీస వేతనాల సలహా మండలి రికమండేషన్ చేసిందన్నారు. వాటికి ఫైనల్ నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. మిగిలిన 56 జీవోలను వాటి ప్రాతిపదికగా సవరించాల్సి ఉందన్నారు. కానీ అలాకాకుండా 2024 జనవరిలో రేవంత్ ప్రభుత్వం పాత 73 జీవోలకు నేటి కరువు భత్యం (విడిఎ) కలుపుకొని ప్రిలిమినరీ నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. ఈ జీవోలలో కేవలం 13 నుంచి 14 వేల లోపు మాత్రమే వేతనాలను సవరించారన్నారు. ఈ ప్రిలిమినరీ నోటిఫికేషన్ను అన్ని కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయన్నారు. 2021లో ఐదు జీవోలలో 21 జీవో సెక్యూరిటీ సర్వీసెస్, 22 జీవో రోడ్, బిల్డింగ్ వర్కర్స్, 23 జీవో స్టోన్ బ్రేకింగ్ వర్కర్స్, 24 జీవో కన్స్ట్రక్షన్స్ అండ్ మల్టీపర్పస్ ప్రాజెక్ట్ వర్కర్స్ 25 జీవో ప్రైవేట్ మోటారు వర్కర్ ఇట్టి అయిదు జీవోలలో కనీస బేసిక్ వేతనం నెలకు 18 వేల, 19 రూపాయలుగా నిర్ధారించారన్నారు. ఆనాటి నుంచి నేటికీ పెరిగిన వి.డి.ఎ. పాయింట్లను కలిపితే నేడు 22 వేల వరకు అవుతుందన్నారు. ఈ జీవోలను గెజిట్ చేస్తే దీని ప్రాతిపదికగా మిగతా జీవోలను కూడా సవరిస్తే కార్మిక వర్గానికి ఒక మంచి ఊరట లభిస్తుందన్నారు. పెరిగిన ధరలకు పిల్లల చదువులు, వైద్యము, ఇంటికి కిరాయిలు కట్టలేక తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారన్నారు. ప్రభుత్వము కొన్ని సంవత్సరాలుగా జీవోలను సవరించకుండా, కాలం గడపడం సరైనది కాదన్నారు. ఇదివరకే ప్రభుత్వానికి అన్ని కార్మిక సంఘాల తరపున విన్నవిస్తూ వచ్చామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ఫైనల్ నోటిఫికేషన్ ఇచ్చిన ఐదు జీవోలకు గెజిట్ ముద్రించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న ఇందిరా పార్క్ దగ్గర అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నా మన్నారు. ఈ ధర్నాకు జిల్లాలోని వివిధ రంగాల కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రెస్‌మీట్‌లో జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వెంకన్న, డి.రాజేశ్వర్, జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లేష్ జిల్లా నాయకులు డి.కిషన్, బి.మురళి, పి.సాయన్న తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీకి శాశ్వత పరిష్కారం చూపండి



వినతి పత్రాని అందజేస్తున్న గ్రామాభివృద్ధి కమిటీ

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఉన్న జాతీయ రహదారి నేషనల్ హైవే-44 అధికారి పీడీ శ్రీనివాస్‌ను కలిసి సమస్యల విన్నపాన్ని విన్నవించారు. ముప్కాల్ బైపాస్ రోడ్డు వద్ద నూతనంగా చేపడుతున్న జాతీయ రహదారి-44 పై బ్రిడ్జి నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డు మార్గం ద్వారా డ్రైనేజీల వద్ద నుంచి గ్రామంలోకి రాకపోకల నిమిత్తం సర్వీస్ రోడ్డు నుంచి మార్గం ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా మురుకి నీరు కాలువలోకి వెళ్లకుండా చేపట్టే పనుల వద్దే నిల్వ ఉండడంతో దుర్వాసన సమస్యలతో దగ్గరలోని నివాస గహాల వారు ఇబ్బందులు పడుతున్నట్లు అధికారి దష్టికి తీసుకెళ్లారు. బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతున్న తరుణంలోనే డ్రైనేజీ వ్యవస్థను కాలువలోకి వెళ్లేలా శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. అందుకు అధికారి సానుకూలంగా స్పందించారని అన్నారు. కార్యక్రమంలో గ్రామాభివద్ధి కమిటీ అధ్యక్షులు సిద్ధ రమేష్, ప్రధాన కార్యదర్శి నేర నర్సయ్య, గ్రామ పెద్దలు కె.గంగాధర్, కట్ట మహేష్, సంజీవ్ థామస్, టి.సాయన్న, గద్దల గంగారాం, రాజేందర్, చిన్న నర్సయ్య తదితరులు పాల్గొన్నారు..

ప్రేమానురాగాలతోనే డౌన్‌సిండ్రోమ్ పిల్లల్లో మార్పులు

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి.పద్మావతి
- ఘనంగా ప్రపంచ డౌన్ సింద్రోమ్ దినోత్సవం



మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

స్థానిక మారుతి నగర్‌లోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ ఆధ్వర్యంలో ప్రపంచ డౌన్ సింద్రోమ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జ్ పి.పద్మావతి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డౌన్ సింద్రోమ్ పిల్లలు పుట్టడానికి నివారణ చర్యలు లేవని, గర్భ విచ్ఛిత్తి మాత్రమే మార్గమని తెలిపారు. డౌన్ సింద్రోమ్ పిల్లలు కలిగిన తల్లిదండ్రులు ప్రేమ అనురాగాలు, ఎక్కువ శ్రద్ధ పిల్లల పట్ల చూపించినట్లయితే ఆ పిల్లల్లో మార్పు వస్తుందని, ఆ పిల్లల పట్ల చిన్నచూపు చూడవద్దని ఆమె కోరారు. ఒక కుటుంబంలో ఇద్దరు పిల్లలుంటే వారి సమానమైన తెలివితేటలు ఉండవని అట్లాగే డౌన్ సింద్రోమ్ పిల్లలు కొంచెం తెలివి తక్కువగా ఉంటారని వారికి విద్యాబుద్ధులు నేర్పించాలని కోరారు. జ్యోతి, సిద్ధయ్యలు స్నేహ సొసైటీని ఏర్పాటు చేసి ఇలాంటి పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నారని అభినందించారు. పిల్లలు వారు వేసిన డ్రాయింగ్స్, పెయింటింగ్స్ చాలా బాగున్నాయని, నార్మల్ పిల్లలు కంటే కూడా బాగా వేశారని వారిని అభినందించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేసిన జిల్లా సంక్షేమ అధికారి రసూల్ బి మాట్లాడుతూ.. డౌన్ సింద్రోమ్ పిల్లలు వరమని తల్లిదండ్రులు భావించినప్పుడు ఆ పిల్లల అభివృద్ధి సక్రమంగా జరుగుతుందని, ఇలాంటి పిల్లలను ప్రత్యేక పాఠశాలలో చేర్పించినప్పుడు వారు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ వైద్యులు డాక్టర్ ప్రతిమ రాజ్ మాట్లాడుతూ.. స్త్రీ పురుషుల్లో 23 జతల క్రోమోజోములు ఉంటాయని 21వ క్రోమోజోములోని ట్రైజోమ్ వల్ల డౌన్ సింద్రోమ్ పిల్లలు పుడతారని, ఒక క్రోమోజం అధికంగా ఉండటం వల్ల డౌన్ సింద్రోమ్ పిల్లలు పుడతారని తెలిపారు. డౌన్ సింద్రోమ్ పిల్లల్లో సాధారణంగా మైల్ స్టోన్స్ అన్ని ఆలస్యంగా అభివృద్ధి చెందుతాయని, వారికి సహకారాన్ని అందిస్తే వారు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారని ఆమె చెప్పారు.మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఇన్నమూరి రవితేజ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ అవినాష్‌లు పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య అందుల పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి మానసిక దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి, పిల్లల తల్లిదండ్రులు మానసిక మానసిక విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు. డ్రాయింగ్ అండ్ పెయింటింగ్ పోటీల్లో పాల్గొన్న డౌన్ విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.

తైబజార్ వేలంలో పాల్గొనండి

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలో రోజు వారీ సంత, గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉన్న రెండు మడిగెల అద్దె కోసం ఈ నెల 24న సోమవారం 11గంటలకు వేలం పాట నిర్వహణ ఉంటుందని స్పెషల్ ఆఫీసర్ గౌస్ మోహినోద్దీన్, పంచాయతీ సెక్రటరీ మల్లేష్ యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందుకుగాను స్థానిక గ్రామస్తులు వేలం పాటలో పాల్గొనాలని అన్నారు. మరిన్ని వివరాల కోరకు స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రాజస్థానీ మహిళల శీతల్ ఉత్సవం



నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలో గల పోచమ్మ ఆలయంలో శుక్రవారం రాజస్థానీ సమాజ్ మహిళలు శీతల్ ఉత్సవాన్ని భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఉదయం గ్రామ దేవత పోచమ్మ ఆలయంలో కుటుంబ సమేతంగా విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం హోళి పండుగ తర్వాత వారం రోజులకు శీతల్ ఉత్సవం నిర్వహించడం రాజస్థానీ మహిళలు ఆనవాయితీగా జరుపుకుంటామని పేర్కొన్నారు. ఉత్సవం సందర్భంగా చల్లటి పదార్థాలను తింటామని వివరించారు.

చలో ఇందిరా పార్క్ ధర్నాను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న టీయూసీఐ నాయకులు

నవతెలంగాణ-బోధన్

అసంఘటిత కార్మికులకు చెల్లించాల్సిన ఐదు కనీస వేతనాల జీవోలను గెజిట్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్, బోధన్ అనామకుడు నాగేశ్వర్ శుక్రవారం బోధన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అన్నారు. అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాలో వివిధ రంగాల కార్మికవర్గం అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

పది పరీక్షలు ప్రారంభం

• **తొలిరోజు ప్రశాంతం**

నవతెలంగాణ-విలేకరుల బృందం

పదోతరగతి పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అయితే మొదటి రోజుల పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పలువురు విద్యార్థులు గైర్హాజరయ్యారు.

బోధన్ : పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు శుక్రవారం కేటాయిలంచిన కేంద్రాలలో ప్రారంభమయ్యాయి. ఎగ్జామినేషన్‌లో భాగంగా బోధన్, సాలూరా మండలంలో 13 సెంటర్లలో 3168 మంది విద్యార్థులకు గానూ 3162 మంది విద్యార్థులు హాజరైనట్టు ఎంఈఓ నాగయ్య తెలిపారు. అందులో ఆరుగురు విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రామారెడ్డి : మండలంలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండల పరిధిలో ఉప్పల్వాయి, రామారెడ్డి తో పాటు రెడ్డిపేట పరీక్ష కేంద్రాల పరిధిలో 525 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా ఇద్దరు విద్యార్థులు గై హాజరై, 523 మంది విద్యార్థులు హాజరైనట్లు మండల విద్యాధికారి ఆనంద్ రావు తెలిపారు.

సదాశివనగర్ : శుక్రవారం తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. నాలుగు సెంట్లలో 690 మంది పరీక్షలు రాసినట్టు మండల విద్యాధికారి యూసఫ్ తెలిపారు. తెలుగు పరీక్షకు అందరూ విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

తాడ్వాయి : పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు మండల విద్యాశాఖ అధికారి రామస్వామి తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు 8.30 గంటలకు పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. జెడ్పీహెచ్ఎస్ కన్కల్ పాఠశాలలో 136 మంది విద్యార్థులు జడ్.పి.హెచ్.ఎస్ తాడ్వాయి 161 మంది విద్యార్థులు బాలికల గురుకుల పాఠశాలలో 150 మంది విద్యార్థులు పూర్తిస్థాయిగా, 447 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని ఉదయం 9:30 గంటల నుండి 12.30 వరకు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించినట్లు తెలిపారు.

ముగ్గురు విద్యార్థులు గైర్హాజరు..

రెంజల్ : మండలంలోని మూడు పరీక్ష కేంద్రాలలో మొదటి రోజు జరిగిన పదవ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని, మండల విద్యాశాఖ అధికారి కట్ట ఆంజనేయులు తెలిపారు. మండలంలో 446 విద్యార్థులకు గానూ 443 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని ఆయన పేర్కొన్నారు. రెంజల్ జిల్లా పరిషత్ పాఠశాలలో 166 మందికి 166 మంది విద్యార్థులు హాజరు కాగా, తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 140 మందికి 139 మంది మాత్రమే పరీక్షలు రాశారని, ఒక విద్యార్థి గైర్హాజరైనట్టు ఆయన పేర్కొన్నారు. జిల్లా పరిషత్ నీలా పాఠశాలలో 140 మంది విద్యార్థులకు గానూ 138 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆయన పేర్కొన్నారు.

పరీక్షా కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలించిన ఎస్సై..

రాజంపేట్ : మండలంలోని కొండాపూర్ గ్రామ పాఠశాలలో ఎస్సెస్సీ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద భద్రతాపరమైన చర్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు ఎస్ఐ పుష్పరాజ్. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చూడాలని మాస్ కాపీయింగ్‌కు, మాల్ ప్రాక్టీస్‌లకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని, పరీక్షా కేంద్రం పరిసరాలలో ఏదైనా సమస్య ఉత్పన్నమైతే వెంటనే నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని, పరీక్షకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని, పరీక్షలు పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

ఎడపల్లి : పదవ తరగతి వార్షిక పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయని ఎడపల్లి మండల విద్యాశాఖ అధికారి శివలింగ్ గాళప్ప తెలిపారు. పరీక్ష కేంద్రాల 144 సెక్షన్ అమల్లో ఉందని ఆయన తెలిపారు. ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసి ఆయన సైతం పర్యవేక్షించారు.

భిక్కనూర్ : మండలంలో పదవ తరగతి పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని జంగంపల్లి, పెద్దమల్లారెడ్డి, భిక్కనూర్ పట్టణాలలో 4 పరీక్ష కేంద్రాలు ఉండగా మొత్తం విద్యార్థులు 691 విద్యార్థులకు 4 విద్యార్థులు గైర్హాజరు కాగా 687 విద్యార్థులు పరీక్షలు రాసినట్టు మండల విద్యాధికారి రాజా గంగారెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు, వైద్య సదుపాయం విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

గాంధారి : 10వ తరగతి మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. గాంధారి మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రంలో 245 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఒకరు హాజరు కాలేదు. పోతంగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 130 మొత్తం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని, గాంధారి సెంటర్లో ఒక విద్యార్థి గైర్హాజరై మండల విద్యాధికారి శ్రీహరి తెలిపారు.

పది పరీక్షలకు ఒకరు గైరాజర్..

పిట్లం : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలుర/బాలికల/ఉన్నత పాఠశాల ఉర్దూ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షలు తొలిరోజైనా అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులు 9 గంటలకే పరీక్ష కేంద్రాలకు రావటంతో పరీక్షల పరిశీలకులు విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించి అర్ధగంట ముందే పరీక్ష హాల్లోకి అనుమతించారు. జిల్లా పరిషత్ హైస్కూల్ పరీక్ష సెంటర్ 180 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా ఒకరు గైర్హాజరయ్యారు. జిల్లా పరిషత్ హైస్కూల్ పరీక్ష సెంటర్ (బీ) అండ్ (సీ) పరీక్ష సెంటర్‌లో 175, 200లకు గానూ ఏ ఒక్కరూ గైర్హాజర్ కాలేదని మండల విద్యాధికారి దేవిసింగ్ తెలిపారు. పరీక్ష తొలిరోజు కావడంతో జిల్లా పరిషత్ హైస్కూల్ గోడమేగావ్, చిన్నకొడప్‌గల్, చిల్లర్గి, రాంపూర్ పాఠశాలల విద్యార్థినీల వెంట వారి తల్లిదండ్రులు పరీక్ష సెంటర్లకు రావటంతో సందడి నెలకొంది.

దోమకొండ : మండల కేంద్రంలో జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో పదవ తరగతి ప్రథమ పరీక్షకు 172 మంది విద్యార్థులు, జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో 184 విద్యార్థులు పదో తరగతి పరీక్షకు హాజరు అయ్యారని తెలిపారు. మొత్తం 356 మంది విద్యార్థులు 100శాతం హాజరయ్యారని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తుతో పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించామని మండల విద్య అధికారి ఎంఈఓ విజయ్ కుమార్ శుక్రవారం తెలిపారు.

సదాశివనగర్ : శుక్రవారం తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. నాలుగు సెంట్లలో 690 మంది పరీక్షలు రాసినట్టు మండల విద్యాధికారి యూసఫ్ తెలిపారు. తెలుగు పరీక్షకు అందరూ విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

పెద్దకొడప్‌గల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొదటి రోజు పదవ తరగతి వార్షిక పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ సూపరింటెండెంట్ రమణ రావు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. మొదటి రోజు పదవ తరగతి వార్షిక పరీక్షలకు 254 విద్యార్థులకు 251మంది విద్యార్థులు హాజరు కాగా 3మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. విద్యార్థులు ప్రతిరోజూ ఉదయం 9:30 నిమిషాల నుండి 12:30 నిమిషాల వరకు పదవ తరగతి వార్షిక పరీక్షలు కొనసాగుతాయని అన్నారు. పదవ తరగతి వార్షిక పరీక్షలు నేపథ్యంలో స్థానిక తహశీల్దార్ దశరథ్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు.



పిట్లం: పరీక్షకేంద్రంలో క్యూకట్టిన విద్యార్థులు



తాడ్వాయిలో..



పెద్దకొడప్‌గల్: హాల్‌టికెట్‌నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

ఎల్లారెడ్డి డిఎస్పీని సన్మానించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



డిఎస్పీని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

ఎల్లారెడ్డి డిఎస్పీగా విధుల్లో చేరిన నూతన డిఎస్పి శ్రీనివాసరావును శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్, క్రమశిక్షణ సంఘం సభ్యులు రామచంద్రారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, తాండూర్ సొసైటీ చైర్మన్ ఆకిడి గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు శ్రీరామ్‌గౌడ్, కోఆర్డినేటర్ నరసింహారెడ్డి, వెంకటరామిరెడ్డి, సంజీవులు తదితరులున్నారు.

ఇంటింటి సర్వేలో ఆశాలు



నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని గ్రామాల్లో ఆశాకార్యకర్తలు చర్మంపై కొత్తగా ఏర్పడిన మచ్చలను ఇంటింటికి తిరుగుతూ వివరాలు సేకరిస్తున్నారని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అర్జున్ నిసారా శుక్రవారం తెలిపారు. జిల్లా కలెక్టర్, మెడి కల్ అధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో అనుమానాస్పద కుష్టు వ్యాధి గ్రస్తు లను, పలు రకాల చర్మ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించి చికిత్సలు చేయించేందుకు కామారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రికి పంపనున్నట్లు తెలిపారు. 14 రోజుల పాటు ఈ సర్వే కొనసాగుతుందని వివరించారు.

సమస్యల పరిష్కారానికి చలో హైదరాబాద్

• **విద్యా వనరుల కేంద్రంలో వినతి**



వినతి అందజేస్తున్న సిఐటీయు నాయకులు

నవతెలంగాణ-రెంజల్

సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈనెల 24న నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ జిల్లా అధ్యక్షులు చామంతి లక్ష్మి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో ఈనెల 24న మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులందరూ హైదరాబాద్ తరలివెళ్తున్న సందర్భంగా, మధ్యాహ్న భోజనం వంటలు చేయలేకపోతున్నామని మండల విద్యా వనరుల కేంద్రంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత ఎనిమిది నెలలుగా కోడిగుడ్డు వేతనాలు, మూడు నెలలుగా గౌరవ వేతనం ఇవ్వడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం మెస్ చార్జీలను అందించాలని అన్నారు. నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో తమ అప్పులు చేసి చిన్నారులకు మధ్యాహ్న భోజనం అందించాల్సిన పరిస్థితి నెలకొందని వివరించారు. ప్రభుత్వం బిల్లులు సకాలంలో చెల్లించడంతోపాటు గౌరవ వేతనం అందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీతో పాటు సౌందర్య హంస, రాజమణి, మండలంలోని మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు పాల్గొన్నారు.

పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుని అరెస్ట్

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా పిడిఎస్యు కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు సురేష్‌కు శుక్రవారం అయిన నివాసం వద్ద ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అడిగే నాయకులను అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. ఈ రాష్ట్రవ్యాప్త అరెస్టులను ప్రజాస్వామికవాదులు, విద్యావేత్తలు, మేధావులు ఖండించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

శ్రీ లక్ష్మీనరసింహ స్వామి చుక్కాపూర్ ఆలయ కమిటీ నియామకం



ఎన్నికైన చుక్కాపూర్ ఆలయ కమిటీ

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ చుక్కాపూర్‌లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీని శుక్రవారం నియమించారు. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా శనిగరం కమలాకర్ రెడ్డి, కమిటీ సభ్యులుగా బండారి యాదగిరి రెడ్డి, గట్టుగోని రామగౌడ్, కొత్త కాపు రాజారెడ్డి, పాత లక్ష్మీరాజ్యం, ఎర్రబోయిన దేవయ్య కందాడి బాల్‌రెడ్డి, కర్రోల్లశంకర్ గౌడ్, ఐలేని వెంకట రాజేశ్వర్ రావు, నల్ల అంజయ్య, చింత రాకేష్ కుమార్, చింతల నర్సింలు తదితరులు నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమపై నమ్మకతో షబ్బీర్ అలీ ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

మద్నూర్ మార్కెట్ కమిటీ కార్యదర్శిగా పి. రమేష్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శిగా పి.రమేష్ బాధ్యతలు స్వీకరించారు. ఇతను పదోన్నతిపై ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్ కమిటీ నుంచి ఇక్కడికి వచ్చారు. శ్రేణి వన్ నుంచి ప్రత్యేక శ్రేణి కార్యదర్శిగా పదోన్నతిపై ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. ఇదివరకు మద్నూర్ మార్కెట్ కమిటీ ఇన్చార్జి కార్యదర్శిగా శ్రీకాంత్ కొనసాగారు. అతని నుంచి కొత్తగా వచ్చిన పి.రమేష్ బాధ్యతలను స్వీకరించారు.

ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ పథకం శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-కామారెడ్డి

భారత ప్రభుత్వం, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వారు అందించే 'ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ పథకం' రెండవ దశ ప్రారంభమైందని జిల్లా పరిశ్రమల అధికారి లాలూ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండవ దశ దరఖాస్తు ప్రక్రియ తేదీ 31.03.2025 వరకు కొనసాగుతుందన్నారు. ఐదేళ్లలో టాప్ 500 కంపెనీల్లో కోటి మంది యువతకు ఇంటర్న్ షిప్ అవకాశాలను అందించడం ఈ పథకం ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా యువత (12) నెలల పాటు నిజజీవిత వ్యాపార వాతావరణం, వైవిధ్యమైన వృత్తులు, ఉపాధి అవకాశాలను పొందగలుగుతాని తెలిపారు. పథకంలోని ముఖ్యంశాలు.. 1.నెలవారీ భత్యం రూ.5000, వన్-టైం గ్రాంట్ రూ.6000, 2.కనీసం 6 నెలల ఉద్యోగ శిక్షణతో 12 నెలల ఇంటర్న్‌షిప్ వ్యవధి ఉంటుంది. 3.వాస్తవ ప్రపంచ అనుభవాన్ని పొందడం, ప్రొఫెషనల్ నెట్వర్క్‌లను, ఉపాధిని మెరుగుపరచడం. ఇందుకోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 21 నుంచి 24 మధ్య వయస్సు, కుటుంబంలో ఎవరూ ప్రభుత్వ ఉద్యోగులు ఉండకూడదని సూచించారు. 10వ, 12వ, ఐటీఐ, పాలిటెక్నిక్, డిప్లొమా, లేదా గ్రాడ్యుయేషన్, గత సంవత్సరం కుటుంబ ఆదాయం రూ.8 లక్షలలోపు కలిగి ఉండాలని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం కోసం 1800116090 (టోల్‌ఫ్రీ) లేదా జూఎఱఖ్‌వతీఅంష్ట్రఱజూ.ఎఉ.స్త్రశీఙ.ఱఅ సందర్శించాలని ఆయన ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల, అర్హతగల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-ఎడపల్లి

ఈనెల 24న సిఐటియు ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు డిమాండ్ల పరిష్కారానికై చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టి నట్లు మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు సిహెచ్ లక్ష్మి తెలిపారు. శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు ఎడపల్లి మండల విద్యాశాఖ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రాన్ని అందజే శారు. ఈనెల 24న సోమవారం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వడ్డించబోమని అధికారులకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఇందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు, కార్మి కులకు సహకరించాలని వారు కోరారు. భోజన కార్మికులకు ఎనిమిది నెలల నుంచి పెండింగ్లో ఉన్న గుడ్ల బిల్లు, మూడు నెలల బకాయి వేతనాలను మంజూరు చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయా లని, నెలకు పదివేల రూపాయల వేతనాన్ని మంజూరు చేయాలని కార్మికులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పదివేల వేతనాన్ని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సంఘం మండల అధ్యక్షురాలు దేరాడి లక్ష్మి, సావిత్రి, స్వప్న, సావిత్రి పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

నవతెలంగాణ-తాడ్వాయి/కామారెడ్డి/సదాశివనగర్

మానవ అక్రమ రవాణా అరికట్టేందుకు కృషిచేయాలని ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మానవ అక్రమ రవాణా నిషేధంపై నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బాలల అక్రమ రవాణా అయితే 100 నెంబర్‌కు చైల్డ్ లైన్ 1098 ఉమెన్స్ హెల్ప్ లైన్ 181 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. గుర్తు తెలియని నెంబర్లతో లాటరీలు వచ్చాయంటూ ఫోన్లు చేస్తే ఎలాంటి సమాచారం ఇవ్వద్దని, అవి సైబర్ క్రైమ్ ఖాతాలు ఖాళీ అవుతాయని అన్నారు. కూడళ్ల వద్ద పోకిరీలు మహిళలపై కేరింతలు తదితర ఘటనలు చేస్తే హెల్ప్ లైన్ నంబర్లకు సమాచారం ఇస్తే అందుబాటులో షీటీం ఉండి రక్షిస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మనోహర్, మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు కొనింటి సుజాత, సీసీలు ప్రసాద్, రమేష్‌గౌడ్, గంగారెడ్డి, సంజీవ్, నర్సింలు, సిఏ పుల్లూరి సత్యం, ఆయా గ్రామాల మహిళా సంఘాల అధ్యక్షులు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



సదాశివనగర్: మాట్లాడుతున్న ఏపీఎం

కామారెడ్డి: కామారెడ్డి మండల సమాఖ్య కార్యాలయ ఆవరణలో మానవ అక్రమ రవాణా నిరోధకపై గ్రామ సంఘం అధ్యక్షులకు, వీఓఏలకు శిక్షణనిచ్చినట్టు డిపిఎం మానవ అభివృద్ధి విభాగం రమేష్ బాబు అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మానవ అక్రమ రవాణా, సైబర్ నేరాలు, ఫోక్సో చట్టం, బీయన్‌యస్ చట్టం, నివారణ చర్యలు చట్టాలపై అవగాహన, సైబర్ ఆధారిత అక్రమ రవాణా, లైంగిక అక్రమ రవాణా చట్టాలపై అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. ఈ శిక్షణ తర్వాత గ్రామాలలోని చిన్న సంఘాల సమావేశంలో సభ్యులకు వీవోఏలు అవగాహన కల్పించాలని కోరారు. శిక్షణను డీపీఎం మానవ అభివృద్ధి విభాగం రమేష్ బాబు, టీఓటిలు ఏపీఎం, సిసిలు ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉమెన్ ట్రాఫిక్‌పై శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారి రాజేందర్, ఏపీఎం మోహిజ్, సీసీలు విశ్వనాథ్, అంజాగౌడ్, స్వరూప రాణి, సంజీవులు, మండల సమాఖ్య సిబ్బంది లావణ్య, లత, సవిత తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్: మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయ ఆవరణలో మానవ అక్రమ రవాణా నిరోధక పై గ్రామ సంఘం అధ్యక్షులకు వీవోఏలకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఏపీఎం రాజారెడ్డి, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట్ : మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో మానవ అక్రమ రవాణా నిరోధకతపై గ్రామ సంఘం అధ్యక్షులకు, విఓఏలకు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మురళీకృష్ణ అవగాహన కల్పించారు. మానవ అక్రమ రవాణా, సైబర్ నేరాలు, ఫోక్సో చట్టాలపై, సైబర్ ఆధారిత అక్రమ రవాణా, లైంగిక అక్రమ రవాణా చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపిఎం జగదీష్, సిసిలు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శాంత, అకౌంటెంట్ రాజు పాల్గొన్నారు.

సహకార సంఘానికి రైతుల తోడ్పాటు అవసరం

నవతెలంగాణ-ఎడపల్లి/మద్నూర్

సహకార సంఘం అభివృద్ధికి రైతులు, పాలకవర్గం సభ్యుల తోడ్పాటు ఎంతో అవసరమని ఎడపల్లి సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సహకార సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షులు మల్కారెడ్డి అధ్యక్షతన మహాజన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి రాజారాం జమ ఖర్చుల లెక్కల వివరాలను సంఘ సభ్యులకు రైతులకు చదివి వినిపించారు. అనంతరం అధ్యక్షులు మల్కారెడ్డి మాట్లాడారు. ఎడపల్లి మండలంలో వరి కోతలు ప్రారంభమైన నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు సభా దృష్టికి తీసుకువచ్చారు. అతి త్వరలోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే ఆ రైతులకు గిట్టుబాటు, ధర మద్దతు ధర వస్తుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. లేనిపక్షంలో దళారులకు ధాన్యాన్ని విక్రయించుకోవాల్సిన అవసరం వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎడపల్లిలో కొందరు రైతులు వారి నూర్పు చేసినందున దళారులు క్వింటాకు రూ.1800 కాడికి ధర పలుకుతున్నారని రైతులు సభలో తెలిపారు. దీనివల్ల రైతాంగానికి గిట్టుబాటు ధర కోల్పోతున్నామని దిగులు చెందారు. వడ్డేపల్లి ధర్మారం గ్రామాలకు కలిపి ఒక గిడ్డంగిని ఏర్పాటు చేయాలని, అలాగే గ్రామంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని వడ్డపల్లి గ్రామానికి చెందిన భీమ్లా నాయక్ రైతు సమావేశంలో తెలిపారు. సమావేశంలో సహకార సంఘం కార్యదర్శి రాజారాం, సిబ్బంది ప్రభాకర్ గౌడ్, సాయిలు, సహకార సంఘం పాలకవర్గం సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల కోసమే సహకార సంఘం..

మద్నూర్: రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పనిముట్లు అందించాలని వ్యవసాయ రైతులు డిమాండ్ చేశారు. మద్నూర్ సింగిల్ విండో 56వ మహాజనసభను శుక్రవారం సంఘం భవనంలో సంఘం చైర్మన్ శ్రీనివాస్ పటేల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాజనసభలో మండల వ్యవసాయ అధికారి రాజు మాట్లాడుతూ.. వచ్చే వానాకాలం పంట సాగు కోసం రైతులకు విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించడానికి సిద్ధంగా ఉంచాలని సూచించారు. సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్ మాట్లాడుతూ.. వ్యవసాయ రైతుల అవసరాల కోసమే సహకార సంఘం పనిచేస్తుందని రైతులకు అవసరమయ్యే విత్తనాలు ఎరువులు, సకాలంలో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సంఘం కార్యదర్శి జె బాబురావు పటేల్ మాట్లాడుతూ.. ఎల్‌టి రుణాలు పొందిన వ్యవసాయదారులు వన్ టైంతో చెల్లించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మహాజనసభలో తెలియజేశారు. సభలో కార్యదర్శి ఆదాయం ఖర్చుల వివరాలు చదివి రైతులకు వినిపించారు. కార్యక్రమంలో సంఘం కార్యవర్గ సభ్యులు, వ్యవసాయ రైతులు సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ స్టేషన్లో బ్రేకర్స్ ఏర్పాట్లు

నవతెలంగాణ-ముప్కాల్



రెంజర్ల గ్రామంలోని సబ్ స్టేషన్లో నూతనంగా బ్రేకర్స్‌ను బిగించినట్టు ముప్కాల్ ఏఈ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆర్మూర్ డీఈఈ పి.వి రాజేశ్వర్ ముఖ్యఅతిథిగా హాజరై బ్రేకర్స్ పనులను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గృహ నివాసులకు నిరంతరం విద్యుత్ సరఫరా చేసేలా తగు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో పెర్కిట్ ఏడీ శ్రీనివాస్, ముప్కాల్ ఏఈ శ్రీనివాస్, సబ్ ఇంజనీర్ కాంతారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

కారు బ్లాక్ ఫిల్మ్ తొలగించిన ట్రాఫిక్ పోలీసులు

నవతెలంగాణ-కంఠేశ్వర్



నగరంలోని ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో జిజి కళాశాల సమీపంలో వాహనాల తనిఖీలు శుక్రవారం నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా ఒక కారు బ్లాక్ ఫిల్మ్ కలిగి వుందని గమనించి ఆ కార్లకు బ్లాక్ ఫిల్మ్ (టింట్) ను తొలగించి ట్రాఫిక్ ఏసిపి నారాయణ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, కారుకు చలానా విధించారు. చలానా కట్టిన అనంతరం వాహనాన్ని వదిలివేశారు. మరల కారుపై బ్లాక్ ఫిలింలో వేయరాదని సూచించారు. ఒకవేళ నగరంలో కారుకు బ్లాక్ ఫిల్లింగ్ ఉంటే తొలగించాలని వాహనదారులకు సూచించారు. లేనియెడల చట్ట ప్రకారంగా చర్యలు తీసుకుంటామన్నారు.

తెలంగాణ ప్రజలు అభివృద్ధి కాలేదు

- విధ్వంసం నుంచి వికసిత భారత్ లక్ష్యంగా రాష్ట్ర పురోగతి
- రాబోయే విద్యా సంవత్సరం ప్రతి కోర్స్‌కు ఇంటర్న్ షిప్
- తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షులు పురుషోత్తం

నవతెలంగాణ-డిచ్‌పల్లి



మాట్లాడుతున్న వీసీ



తెలంగాణ అభివృద్ధి అయింది.. కానీ ప్రజలు అభివృద్ధి కాలేదని, విధ్వంసం నుంచి వికసిత భారత్ లక్ష్యంగా రాష్ట్ర పురోగతి సాధిస్తుందని, రాబోయే విద్యా సంవత్సరం ప్రతి కోర్స్ కు ఇంటర్న్ షిప్ ప్రవేశపెట్టనున్నామని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షులు ఈ పురుషోత్తం పేర్కొన్నారు. శుక్రవారం తెలంగాణ యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్స్ విభాగాధిపతి డాక్టర్ ఏ పున్నయ్య అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ 2025-26 విశ్లేషణ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు.ఈ సెమినార్ కు ముఖ్యఅతిథిగా తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి యాదగిరిరావు, గౌరవ అతిథులుగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ యం యాదగిరి, ప్రత్యేక ఆహ్వానితులుగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రవీణ్ మామిడాల, బిజయ్ కుమార్ సాహూ ఎస్ బి ఐ డీజీఎం,కీలక ఉపన్యాసం చేయడానికి తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షులు ప్రొఫెసర్. ఇ. పురుషోత్తం హాజరైనారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్యఅతిథి వైస్ ఛాన్సర్ ఆచార్య టి యాదగిరిరావు మాట్లాడుతూ 2025 -26 సంవత్సరానికి గాను ఈ ప్రభుత్వం రూ. 3,04,965 కోట్లు బడ్జెట్ ను ప్రవేశపెట్టిందన్నారు. ఈ కేటాయింపులు విధ్వంసం నుంచి వికసిత భారత్ లక్ష్యంగా రాష్ట్ర పురోగతి ఉంటుందని పేర్కొన్నారు.

రిజిస్ట్రార్ ఆచార్య ఎం. యాదగిరి మాట్లాడుతూ సమగ్ర మరియు స్థిరమైన అభివృద్ధికి ఈ బడ్జెట్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రెవెన్యూ ఎక్స్పెండిచర్ కంటే క్యాపిటల్ ఎక్స్పెండిచర్ అధికంగా ఉన్నప్పుడే రాష్ట్రం పురోగతి దిశగా అడుగులు వేస్తుందని పేర్కొన్నారు.

ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఆచార్య ఈ పురుషోత్తం కీలకోపన్యాసం చేస్తూ తెలంగాణ అభివృద్ధి జరిగింది కానీ తెలంగాణ ప్రజల అభివృద్ధి జరగలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యారంగం మీద మనస్సు కేంద్రీకరించారని, విద్యకు గతంలో ఎన్నడు లేని విధంగా రూ. 23,108 కోట్లు కేటాయించిందని, ఇది గతం కంటే రూ. 1816 కోట్లు అధికమన్నారు. ఉన్నత విద్యారంగాన్ని అభివృద్ధి పదంలో ముందుకు తీసుకుపోవడానికి అభివృద్ధి పద్ధతి కింద రూ. 500 కోట్లు కేటాయించడంతో ఉన్నత విద్యా రంగంలో బోధనా పరిశోధన వసతులు మెరుగయితాయని పేర్కొన్నారు. విద్యారంగ అభివృద్ధికి 58 ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను అన్ని వసతులతో ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ నడుంబిగించిందని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయాలని సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్‌ల పదవీ విరమణ వయసు 65 సంవత్సరాలకు పెంచినారని పేర్కొన్నారు. ఉన్నత విద్యారంగంలో పాఠ్యప్రణాళికలో మార్పులకు ఉన్నత విద్యా మండలి నడుం బిగించిందని పేర్కొన్నారు. రాబోయే విద్యా సంవత్సరం ప్రతి కోర్స్‌కు ఇంటర్న్ షిప్ ప్రవేశపెట్టనున్నామని తెలిపారు. త్వరలో విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. అకాడమిక్ కన్సల్టెంట్ సర్వీసును క్రమబద్ధీకరి ంచడానికి ఉన్నత విద్యా మండలి కృషి చేస్తుందని పేర్కొన్నారు. అవుట్సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను సమీక్షించి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న ఎస్ బి ఐ, డీజీఎం బిజయ్ సాహు మాట్లా డుతూ ప్రతి ఒక్కరూ పొదుపు ప్రవృత్తిని పెంచుకో వాలని,జీవిత బీమా మరియు డిపాజిట్లు పెంచుకోని ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో భాగం పంచుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వా నితులుగా పాల్గొన్న ప్రిన్సి పల్ డాక్టర్ ప్రవీణ్ మామిడాల మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ కూర్పులో తెలంగాణ విశ్వవిద్యాలయంలోని విద్యార్థుల భాగస్వామ్యం ఉండే విధంగా విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సెమినార్‌లో చైర్మన్ బిఓఎస్ డా.టి సంపత్ ప్రొఫె సర్ రవీందర్ రెడ్డి, డా.నాగరాజు పాత, డాక్టర్ ఎన్ స్వప్న డా. సిహెచ్ శ్రీనివాస్, డా. దత్త హరి పాల్గొన్నారు.

అనంతరం ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్‌ను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.యాదగిరిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరి, తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (టూటా) డాక్టర్ అడిగే నాగరాజ్, డాక్టర్ వాసం చంద్రశేఖర్, డాక్టర్ మావు రపు సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ బోయపాటి శిరీష, ప్రొఫెసర్ కనకయ్య,కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ డా. దత్త హరి, డాక్టర్ రామలింగం, డాక్టర్ నరసయ్య, డాక్టర్ గంగా కిషన్, డాక్టర్ కిరణ్ రాథోడ్లు, ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ బాధ్యులు పూల బొకే శాలువాతో సన్మానించారు.

సిద్దలగుట్ట ఆలయం పిరమిడ్ సమస్యలు పరిష్కరించాలి



వినయ్‌రెడ్డిని సన్మానిస్తున్న పీఎంఎస్ఎం కమిటీ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని సిద్దుల గుట్టలోఓ ఆలయం పిరమిడ్ వద్దకు వచ్చే భక్తులకు నీటి సౌకర్యాన్ని కల్పించాలని పిఎస్ ఎస్ ఎం జిల్లా అధ్యక్షులు, అడ్వకేట్ సాయికృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వినయ్ కుమార్ రెడ్డిని కలిశారు. వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. వాటర్ ట్యాంక్ పైప్ లైన్ కొరకు నిధులను మంజూరు చెపిస్తామని సిద్దుల గుట్ట అభివృద్ధికి పిరమిడ్ సొసైటీ కి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో పిఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షులు జిల్లా కమిటి సభ్యులు మల్లారం సాయి నాథ్ యాదవ్ సబ్బ సుదర్శన్,ఆర్మూర్ రాజు, ప్రశాంత్ రెడ్డి,ఆర్మూర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్ బాల్ భారత జట్టుకు ఎంపికైన క్రీడాకారినికి ఆర్థిక సహాయం



ఆర్థికసాయం అందజేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు ఉమాజీ నరేష్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

సాఫ్ట్‌బాల్ భారత జట్టుకు ఎంపికైన క్రీడాకారిణికి శుక్రవారం జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు ఉమ్మాజి నరేష్ ఆర్థిక సహాయం అందజేశారు. జక్రాన్‌పల్లి గ్రామానికి చెందిన గన్న లక్ష్మణ్ కూతురు గన్న వర్షినికి నిజామాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు ఉమ్మాజీ నరేష్ ఖర్చుల నిమిత్తం 10వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. అమ్మాయికి ఆల్ ద బెస్ట్ తెలుపుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వినోద్, డి సి సి కార్యదర్శి గన్న లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

గుండెపోటుతో ప్రభుత్వ వైద్యుడు మృతి



ఆర్మూర్‌లో నివాళ్లు అర్పిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-కంఠేశ్వర్/ఆర్మూర్

పట్టణ ఏరియా ఆసుపత్రిలో వైద్యునిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీకాంత్ (34) శుక్రవారం గుండెపోటుతో మరణించారు. ఈయన స్వస్థలం మోస్రా, కాగా పట్టణ ఆస్పత్రిలో వైద్యుని పనిచేస్తున్నారు. ఆయన మృతి పట్ల శ్రద్ధాంజలి ఘటించి మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపర్డెంట్ రవికుమార్, వైద్యులు ఏలేటి అమృత్ రామ్ రెడ్డి, అజయ్, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్: ఆర్మూర్ ఏరియా ఆసుపత్రిలో మెడికల్ ఆఫీసర్గా విధులు నిర్వహించిన డాక్టర్ శ్రీకాంత్ మృతి చెందగా మోస్రా లో ఆయుష్ విభాగం జిల్లా ఇన్చార్జి డాక్టర్ గంగాదాస్, డాక్టర్ వెంకటేష్, ఆయుష్ పురుషో త్తం తదితరులు పాల్గొని మృతదేహం వద్ద మూలమరలు వేసి నివాళులు అర్పించారు. డాక్టర్ శ్రీకాంత్‌ఆర్మూర్ ఏరియా ఆసుపత్రిలో మెడికల్ ఆఫీసర్ గా విధులు నిర్వర్తిస్తు శుక్రవారం ఉదయం గుండె పోటుతో మరణించినట్టు ఆయుష్ విభాగం ఇన్చార్జ్ డాక్టర్ గంగాదాస్, వెంకటేష్, పురుషోత్తం తెలిపారు. ఆయన భార్య నిర్మల్ జిల్లాలో ఆయుర్వేద వైద్యులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. శ్రీకాంత్ స్వస్థలం మోస్రా. జిల్లా ఆయుష్ విభాగం ఇన్చార్జి డాక్టర్ గంగా దాస్, డా. వెంకటేష్, ఆయుష్ పురు షో తం, భిక్షపతి, రమేష్ తదితరులు నివాళులు అర్పించారు.

తాగునీటి ఎద్దడి రావొద్దు

జిల్లా పంచాయతీ అధికారి మురళి

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని ఏ ఒక్క గ్రామంలో కూడా తాగునీటి ఎద్దడి రావద్దని జిల్లా పంచాయతీ అధికారి మురళి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పైప్‌లైన్లు, విద్యుత్ మోటార్లు చెడిపోతే సత్వరమే మరమ్మతులు చేయించి నీటి సరఫరా చేయాలని సూచించారు. వచ్చే జూన్ మాసం వరకు తాగునీటి సమస్య రాకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ సిబ్బందేనని తెలిపారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ల సమస్య ఉంటే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. గ్రామాల్లో పేరుకుపోయిన ఇంటి పన్ను బకాయిలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టి వసూలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి రాజారాం, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీఓ సరితారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు బాలు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

25, 26 తేదీల్లో జై సంవిధాన్

- టీపీసీసీ అధికార ప్రతినిధి ఏబి శ్రీనివాస్

నవతెలంగాణ-ఆర్మూర్

నియోజకవర్గంలో ఈనెల 25, 26 తేదీల్లో జై భీమ్.. జై బాబు.. జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పిసిసి అధికార ప్రతినిధి ఏబి శ్రీనివాస్ తెలిపారు.

ఈ సందర్భంగ పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏఐసీసీ, పిసిసి ఆదేశాల మేరకు సంవత్సరకాలం పాటు నిర్వహించనున్న జై భీమ్ జై బాపు జై సంవిధాన్ కార్యక్రమానికి పిలుపు ఇచ్చినట్టు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకత్వం అంత పాల్గొంటుంది అని అన్నారు. ప్రస్తుతం దేశంలో రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్లి రాజ్యాంగం పై జరుగతున్న దాడిని, రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవలసిన ఆవశక్యతను ప్రజలకు వివరిస్తూ వారిని చైతన్య పరుస్తామని, గాంధీ సిద్ధాంతాలను ప్రజలకు వివరిస్తామని అన్నారు, ఇదే కార్యక్రమంలో పార్టీ శ్రేణులు ప్రజల్లోకి వెళ్ళటం ద్వారా ప్రభుత్వ పథకాలు అర్హులకు అందుతున్నాయా.. లేదా.. తెలుసుకుని అధికారులకు సిఫారసు చేసి వారికి లబ్ది చేకూరె విధంగా చూస్తామని అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు పాత కాంగ్రెస్ కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల్లో మొదటి ప్రాధాన్యం ఇవ్వమని చెప్పారని, దీని ద్వారా కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం పెరుగుతుందని అన్నారు. ఇటీవల ఎంపీ అరవింద్ సుదర్శన్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, సుదర్శన్ రెడ్డి కాలి గోటికి అరవింద్ సరిపోడని అన్నారు. అరవింద్ తండ్రి శ్రీనివాస్ చనిపోతే సుదర్శన్ రెడ్డి చొరవతో ప్రభుత్వ అధికార లాంచనలతో అంత్యక్రియలు జరిపించారని అన్నారు. అరవింద్ తినే తిండి, వేసుకునే బట్టలు కాంగ్రెస్ పార్టీ పుణ్యం అని అన్నారు, ఇంకోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే జిల్లాలో తిరగనియ్యం అని ఖబర్దార్ అని హెచ్చరించారు. కేటీఆర్ నిన్న సూర్యాపేటలో మాట్లాడుతూ పాదయాత్ర చేస్తా అని అంటున్నాడు అని, దారినపోయే వాళ్ళు పాదయాత్ర చేస్తే ప్రజలు పట్టించుకోరని, పాదయాత్ర అంటే వైయస్ రాజశేఖర్ రెడ్డిది చారిత్రాత్మక పాదయాత్ర అని అన్నారు. కేటీఆర్ చేసేది ఆధిపత్యం కోసం అని వాళ్ళ పార్టీలో హరీష్ రావు కేటీఆర్‌కు బిఆర్ఎస్ పార్టీలో ఆధిపత్యం కోసం జరుగుతున్న కొట్లాట అని అన్నారు. సమావేశంలో పిసిసి ప్రచార కమిటీ సభ్యులు కోలా వెంకటేష్, ఎస్సీ సెల్ స్టేట్ కన్వీనర్ దేగాం ప్రమోద్, పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి షైక్ పాషా, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి పడమిటి ప్రవీణ్, మైనారిటీ సెల్ మాజీ ప్రెసిడెంట్ బబ్లు, ఆర్మూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తలారి రాకేష్, సెక్రెటరీలు రటం అరుణ్, రాజకుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎబి శ్రీనివాస్

ఎథిక్స్, డిసిప్లేన్ అర్చరీ ఫెడరేషన్ అఫ్ ఇండియా కమిటీ చైర్మన్‌గా ఈగ సంజీవరెడ్డి

నవతెలంగాణ-మోపాల్

అర్చరీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎథిక్స్ మరియు డిసిప్లేన్ చైర్మన్‌గా జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు, అర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అయిన ఈగ సంజీవరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అరవింద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈగ సంజీవరెడ్డి ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎథిక్స్, డిసిప్లేన్ చైర్మన్ ఎంపిక పట్ల జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ చైర్మన్ అంద్యాల లింగయ్య, ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, భూమారెడ్డి, ఉపాధ్యక్షులు భక్త వత్సలం, ప్రవీణ్ రెడ్డి, గాధరి సంజీవ్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులు, పలు క్రీడా సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

24న చలో హైదరాబాద్



వినతిపత్రం అందజేస్తున్న ఆశాలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం రూ.18వేలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశాలకు కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన మాటను అమలు కోసం ఈనెల 24న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) మండల అధ్యక్షురాలు బోడికే స్వప్న అన్నారు. శుక్రవారం ఇందల్ వాయి ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ 2023 సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా 15 రోజులు ఆశా వర్కర్లు రాష్ట్రంలో నిరవధిక సమ్మె చేసిన సందర్భంగా 09-10-2023 హైదరాబాద్, కోఠి కమిషనర్ ఆఫీస్ ముందు వేలాది మంది ఆశా వర్కర్లతో ధర్నా నిర్వహించగా ఆనాటి హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు ఆశా యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీతో చర్చలు జరిపి కొన్ని నిర్దిష్టమైన హామీలు ఇచ్చారని తెలిపారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఐఎఎస్ ఆఫీసర్ ఆధ్వర్యంలో కమిటీ వేస్తామని, వేసిన కమిటీ ఆశాల సమస్యలను పరిశీలించి ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనలు పంపే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. వీటితో పాటు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీనిచ్చిందని తెలిపారు. 2024 ఫిబ్రవరి 9న, జూలై 30న, డిశెంబర్ 10న ఆరోగ్య శాఖ కమీషనర్ ఆఫీస్ ముందు ఆశాల ధర్నా, చర్చల సందర్భంగా కమీషనర్ స్పందిస్తూ రూ.50 లక్షల ఇన్సూరెన్స్ ఇస్తామని, మట్టి ఖర్చులు రూ.50 వేలు ఇస్తామని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సెలవులు ఇస్తామని, టార్గెట్స్ రద్దు చేస్తామని నిర్దిష్టమైన హామీలు ఇచ్చారని అన్నారు. కాని ఇంతవరకు హామీ నేరవేరలేదన్నారు. ఈ సమస్యలు పరిష్కారం చేయాలని, ప్రభుత్వం ఇప్పటికైనా బడ్జెట్ సమావేశాల్లో ఆశలకు ఫిక్స్ వేతనం 18వేలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అశా కార్యకర్తలు సునితా,లత, రేణుకా, ఉపేంద్ర, సురేఖ, నిర్మలా,పి రేణుకా తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలు మొదటిరోజు ప్రశాంతం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మొదటి రోజు నిర్వహించిన పదవ తరగతి పరీక్షలు 141 పరీక్ష కేంద్రాల్లో 22,774 మంది విద్యార్థులకు గాను 59 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఎక్కడ ఎటువంటి సమస్యలు తలెత్తకుండా, మాల్ ప్రాక్టీస్ కాకుండా అన్ని పరీక్షా కేంద్రాల విద్యార్థులు ఆలస్యం కాకుండా మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా నిర్వహించామని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఒక ప్రకటన లో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఒక పరీక్ష కేంద్రాన్ని డి ఈ ఓ 6 పరీక్ష కేకేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్స్ 41 పరీక్షా కేంద్రాలను పర్యవేక్షణ చేశామని వివరించారు.

ప్రశాంతంగా మొదటి రోజు పదోతరగతి పరీక్షలు

ఏర్గట్ల: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొదటి రోజు పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయి.మండలానికి చెందిన ఏర్గట్ల,గుమ్మిర్యాల్,తాళ్ళరాంపూర్, తడపాకల్, కేజీబీవీ పాఠశాలల విద్యార్థులు, బాలురు 61 మంది ,బాలికలు 55 మంది మొత్తం 116 మంది పరీక్షలు రాయగా ఒక విద్యార్థి గైర్హాజరై నట్లు ఎంఈఓ ఆనంద్ రావ్ తెలిపారు.

ప్రశాంతంగా పదోతరగతి పరీక్షలు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి, ఇందల్‌వాయి మండలాల్లో శుక్రవారం పదోతరగతి పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగినట్లు మండల విద్యాశాఖాధికారులు శ్రీనివాస్, శ్రీ ధర్‌లు తెలిపారు.

మొదటి రోజు పది పరీక్షలు ప్రశాంతం

మెండోర: పదవ తరగతి వార్షిక పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థుల కోసం మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 346 మంది విద్యార్థిని విద్యార్థులు పరీక్షలు రాయవలసి ఉండగా వంద శాతం పరీక్షలకు హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి తెలిపారు. 346 మంది విద్యార్థిని విద్యార్థులకు గాను 338 మంది విద్యార్థులు మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలకు హాజరుకాగ, వెల్లటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఎనిమిది మంది విద్యార్థిని విద్యార్థులు ముప్కాల్ మండలానికి చెందిన రెంజర్ల గ్రామంలో పరీక్షలకు హాజరు అయినట్లు పేర్కొన్నారు.

ముప్కాల్: మండలంలో పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా మొదలైనట్లు మండల విద్యాధికారి జె.రవి కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముప్కాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులు 150 మందికి 150 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. అదేవిధంగా రెంజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 34 మంది విద్యార్థులకు గాను 34 మంది హాజరయ్యారని ఈ సందర్భంగా తెలిపారు. ప్రతి తరగతి గదిలో విద్యార్థుల సౌకర్యార్థం మంచి నీటి సమస్యలు తలెత్తకుండా చూశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఏర్గట్లలో..



మెండోరలో



డిచ్‌పల్లిలో..

బిజెపి మహిళా మోర్చా అసెంబ్లీ కన్వీనర్ రాజీనామా.

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ బిజెపి మహిళా మోర్చా అసెంబ్లీ కన్వీనర్‌గా పనిచేస్తున్న స్వభావిక గౌడ్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2012 సంవత్సరం నుండి పార్టీలో పని చేస్తున్నట్టు, సీనియర్‌గా పనిచేస్తూ నిర్విరామ సేవలు చేసిన సీనియర్లకు గుర్తింపు లేదని అన్నారు. సమావేశాలకు, ఇతరత్రా కార్యక్రమాలకు ఆహ్వానం లేకపోవడంతో రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి, జిల్లా అధ్యక్షురాలు పంచ రెడ్డి ప్రవల్లిక, జిల్లా అధ్యక్షులు దినేష్ కులచారి లకు రాజీనామా లెటర్లను అందజేసినట్టు తెలిపారు.

నీరడి లక్ష్మణ్‌కు సన్మానం

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాలల అభ్యున్నతికి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడుగు గంగాధర్ అన్నారు. నగరంలోని సుభాష్‌నగర్‌లో గల మాల మహానాడు జిల్లా కార్యాలయానికి శుక్రవారం గడుగు గంగాధర్ సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాలల సమస్యల పరిష్కారంలో ముందుండాలని సూచించారు. అనంతరం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నీరడి లక్ష్మణ్‌ను గడుగు గంగాధర్ సత్కరించారు.

మొక్కజొన్న పంట క్షేత్రస్థాయి ప్రదర్శన

నవతెలంగాణ-రాజంపేట్



మండలంలో ఆరెపల్లి గ్రామంలో డెకాల్బ్ బాయర్ కంపెనీ వారు రైతు క్షేత్రస్థాయి ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు సీసీఎం నితీన్‌రెడ్డి, సూపర్వైజర్ నిఖిల్‌గౌడ్, టీంఎండి సంజీవ్, జైపాల్‌రెడ్డి ఎఫ్ఓ తమ కంపెనీ మొక్కజొన్న విత్తనాలపై వివరించారు. డెకాల్బ్ 9247 అనే రకం విత్తనం గురించి వివరిస్తూ ఈ రకమైన విత్తనం అన్ని కాలాలకు అణువైనదిగా (వానాకాలం, యాసంగి) ఎండకు వానకు తట్టుకునే శక్తి ఈ రకానికి ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమం ఆరేపల్లి గ్రామంలో రేస్మాయి వెంకట్‌రావు మొక్కజొన్న చేనులో చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారని కంపెనీ ప్రతినిధులు తెలియజేశారు.

పెద్దమ్మ ఆలయ కమిటీ సభ్యులకు సన్మానం

నవతెలంగాణ-దోమకొండ



మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో పెద్దమ్మ ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు పున్న లక్ష్మణ్, అధ్యక్షుడు నాగారపు ఎల్లయ్య, ఆలయ కమిటీ సభ్యులను మాజీ జెడ్పిటిసి తీగల తిరుమలగౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెద్దమ్మ ఆలయాభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సీతారాం మధు, పెద్దమ్మ ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు అబ్రబోయిన పురుషోత్తం, కార్యదర్శి అబ్రబోయిన రాజేందర్, కోశాధికారి గంప సంతోష్, జాయింట్ సెక్రెటరీ బట్టు రాజయ్య, పెద్దమ్మ ఆలయ కమిటీ మాజీ అధ్యక్షులు గాండ్ల రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు చెక్‌పడేనా?

- నేటి నుండి ఐపీఎల్
- బెట్టింగులు నిర్వహిస్తే చర్యలు తప్పవు
- బెట్టింగ్‌లపై మానిటరింగ్ చేస్తూ ప్లానింగ్‌తో వెళ్తున్నాం
- నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఇండియన్ ప్రీమియర్ లీగ్-2025 (ఐపీఎల్ 2025) నేడు కొత్త సీజన్ మార్చి 22, శనివారం నుంచి ప్రారంభం కానుంది. ఈ ఉత్కంఠభరితమైన ఆటను చూడటానికి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే మరోవైపు ఐపీఎల్ బెట్టింగ్ నిర్వాహకులు సైతం తప్పుదోవలో డబ్బును సంపాదించేందుకు ఈ అవకాశాన్ని వాడుకుంటూ యువత జీవితాన్ని నాశనం చేస్తున్నారు. ఇందుకు చెక్ పెట్టేందుకు నిజామాబాద్ జిల్లా పోలీసులు సైతం రంగంలోకి దిగారు. తెలుగు సినిమా పరిశ్రమ ను బెట్టింగ్ యాప్ కేసులు కుదిపేస్తున్నాయి. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న వారి విషయంలో తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలకు ఆదేశించింది. అందులో భాగంగానే ఎప్పటికప్పుడు నిజామాబాద్ జిల్లాలో ఆన్లైన్ బెట్టింగ్‌లపై పోలీసులు సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. ఆన్లైన్ బెట్టింగ్‌ల వల్ల ఎక్కడో ఒకచోట ఆత్మహత్య చేసుకున్న ఘటనలు సైతం ఎన్నో ఉన్నాయి. ఈ నేపథ్యంలో నిజామాబాద్ పోలీసులకు ఈనెల 22నుండి ఐపీఎల్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో పోలీసులకు సవాలుగా మారింది. ఆన్లైన్ బెట్టింగ్ యాప్లతో అమాయకులు మోసపోతున్నారు. ఈ బెట్టింగ్ యాప్లను వ్యసనంగా మార్చుకుని అధిక వడ్డీలకు అప్పులు చేసి భారీ మొత్తంలో కూరుకుపోతున్నారు.

పుట్టగొడుగుల్లా బెట్టింగ్ యాప్స్.....

మొబైల్ ఓపెన్ చేస్తే చాలు ఒకటి కాదు రెండు కాదు వందల సంఖ్యల్లో ఎన్నో అఫీషియల్, అన్‌అఫీషియల్ ఆన్లైన్ బెట్టింగ్



యాప్స్ పుట్టగొడుగుల్లా పుట్టుకువస్తున్నాయి. యూట్యూబ్, సోషల్ మీడియా, పలు వెబ్సైట్లలో రూ.100 పెడితే రూ. 1000 ఇస్తామంటూ బెట్టింగ్ యాప్స్ యాడ్‌పర్సస్‌తో మోసం చేస్తున్నారు. చేపకు గాలం వేసినట్లు కొత్త కస్టమర్లకు మొదట్లో రూ.100 రూ.200, రూ.1000కు రూ.2000 వేలు, రూ.3000 వేలు ఇస్తూ మెల్లగా యువతను ఊబిలోకి లాగుతున్నారు.

ఆర్థికంగా చితికిపోతున్నారు.........

ప్రస్తుతం యువత పగలు, రాత్రి తేడా లేకుండా 24 గంటలూ ఆన్లైన్ బెట్టింగ్ గేమ్స్ లో కూరుకుపోతున్నారు. గతంలో ఈ వ్యసనం కొంతమంది యువతకే పరిమితవ్వగా, ఇప్పుడు అది ప్రభుత్వ ఉద్యోగులు, సాఫ్ట్వేర్ ఇంజనీర్లు, బ్యాంకర్లు.. ఇలా తేడా లేకుండా ప్రతిఒక్కరూ బెట్టింగులు ఆడుతున్నారు. అయితే ఈ బెట్టింగులు ఆడేవారిలో 99 శాతం మంది చేతులు కాల్చుకుని ఆర్థికంగా చితికిపోతున్నారు. ఆన్లైన్ బెట్టింగులో భారీగా సంపాదించవచ్చని అనుకుంటున్నారు. అప్పులు తీర్చే అవకాశం లేక కుటుంబమంతా ఆత్మహత్య చేసుకునే పరిస్థితులు ఉంటున్నాయి.

పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాము ఎవరిని ఉపేక్షించేది లేదు

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య....



ప్రస్తుతం ఐపీఎల్ మ్యాచులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో అవగాహన చర్యలు చేపట్టాం. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ అన్ని చర్యలు చేపట్టి గతంలో బెట్టింగ్ నిర్వాహకుల వివరాలను సేకరిస్తున్నాం. బెట్టింగ్లకు పాల్పడే వారిపై దృష్టి సారించాం. సైబర్ మోసాలు, బెట్టింగ్‌లో దురాశ ఉన్నచోటే ఎదురుదెబ్బ తగులుతుంది. 1:5, 1:10 చొప్పున పైసలు ఇస్తామంటే అది మోసం చేయడమే. కెపాసిటీని మించి డబ్బులు పెడుతూ భారీగా మోసపోతున్నారు. రూ.10వేలు అయితే అదృష్టం కలిసి వస్తుందని రూ.లక్ష బెట్టింగ్ పెడుతున్నారు. కష్టపడి చదువుకుని ఉన్నత ఉద్యోగాలు చేసుకోవాలి. జిల్లావ్యాప్తంగా ఎక్కడైనా ఆన్లైన్ బెట్టింగ్లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ శాఖ తరపున హెచ్చరించారు.

వర్ని ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం

నవతెలంగాణ-వర్ని

వర్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ బాబాను, వైస్ చైర్మన్ లక్ష్మణ్‌ను పండాల్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శాలువా కప్పి సన్మానించారు. గత వారం రోజులుగా మహారాష్ట్ర ప్రాంతంలో వర్ని మార్కెట్ బృందం అక్కడి రైతులు పడించే పంటలు, సాగుచేసే విధానాన్ని వారు పరిశీలించారు. శుక్రవారం పండాల్‌పూర్ మండలంలో మార్కెట్ యార్డ్‌లలో రైతులు తెచ్చి మద్దతు ధరకు అమ్ముకొనే వెసులుబాటు, కూరగాయల ధరలను పరిశీలించారు. అక్కడ ఇక్కడకి రైతుల పంట సాగు అంశాల రైతులను అడిగి తెలుసుకున్నారు. వారు పండించే విధానాన్ని తోటి పక్క రాష్ట్రాలకు ఆదర్శంగా ఉన్నారని సురేష్ బాబా తెలిపారు. ఇలాంటి సాగు విధానం అన్ని రాష్ట్రాల రైతులకు మంచి అవకాశం, అన్ని మంచి లాభాలు తెస్తుందని, మహారాష్ట్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో పాటు కమిటీ సభ్యులు, సిబ్బంది తదితరులున్నారు.

వృద్ధాశ్రమంలో పండ్ల పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని అంకాపూర్ గ్రామ సమీపంలోని ప్రొద్దుటూరు , లాలన వృద్ధాశ్రమాల్లో బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు దొండి రమణ శుక్రవారం పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించినారు. ఆయన కుమారుడు దొండి నిశ్చయి దీప్ పుట్టినరోజు సందర్భంగా పలు ఆశ్రమాల్లో పండ్ల కార్యక్రమం చేపట్టడం జరిగింది అని, సొంతగా నిశ్చయ్ సొల్యూషన్స్, టెక్నాలజీని ప్రారంభించి వ్యాపార రంగంలో రాణిస్తున్నారని నేటి యువతకు ఆదర్శంగా స్ఫూర్తిదాయకంగా నిలిచినందుకు సంతోషంగా ఉందని అన్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి గ యువతను ముందుండి నడిపిస్తున్నారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో దొండి రమణ కుటుంబ సభ్యులు, ఆశ్రమాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధి దిశగా ఎన్డిసిసిబి వ్యాపారం



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు వ్యాపార కార్యకలాపాలు 1800 కోట్ల నుండి 2100 కోట్లకి (వృద్ధి 300 కోట్లు) (బిజినెస్) పెరిగిన శుభ సందర్భంగా బ్యాంకు అధ్యక్షులు కుంట రమేష్ రెడ్డి కేకు కోసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ లక్ష్యం చేరుకున్నందుకు సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ముందు కాలంలో ఇంకెన్నో లక్ష్యాలు చేరుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. మునుపటి లాగా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపేలా కృషి చేయాలని సూచించారు. బ్యాంకు బాగుంటే మనం బాగుంటామని, భవిష్యత్ బాగుంటుందని పునరుద్ఘాటించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 14శాతంగా ఉన్న ఎన్‌పీఏ 8.5 శాతానికి తగ్గించారని, ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు వరకు ఎన్‌పీఏ ఇంకనూ గణనీయంగా తగ్గించాలని సూచించారు. దీంతో పాటు ప్రస్తుతం ఉన్న ఓటీఎస్ సదుపాయం మార్చి 31తో ముగుస్తున్నందున అర్హత గల రుణగ్రస్తులు ఈ అవకాశం వినియోగించుకుని రుణాలు తిరిగి చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చలో అసెంబ్లీ ముట్టడి ఉద్రిక్తత

- అరెస్టయిన పిడిఎస్‌యూ నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించడన్నీ నిరసిస్తూ, రాష్ట్ర బడ్జెట్ ను సవరించి 20శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలని పిడిఎస్‌యూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించారు. అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ నుంచి వెళ్లిన పి డి ఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, వంశీ, 70 మందిని అరెస్టు చేసి హైదరాబాద్‌లోని కంచన్ బగ్, చంద్రయాన్ గుట్ట, అబ్జల్ గంజ్, నాంపల్లి పోలీసు స్టేషన్స్ కు తరలించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత 10 ఏళ్ల కాలంలో కెసిఆర్ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందని, నేడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా విద్యారంగాన్ని పట్టించుకోవడంలేదని అన్నారు. రాష్ట్ర బడ్జెట్లో 15శాతం నిధులు కేటాయిస్తామని మేనిఫెస్టోలో ప్రకటించి బడ్జెట్లో కేవలం 7.57శాతం నిధులను మాత్రమే కేటాయించారని, ప్రభుత్వ ఇంటర్నేషనల్ స్కూల్స్ ఊసే లేదని, నూతనంగా ఇంజనీరింగ్ కాలేజ్‌ల ఏర్పాటు, యూనివర్సిటీలకు అధిక నిధులు కేటాయించడం జరగలేదని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల కేటాయింపు లేదని, విద్యాశాఖ సీఎం దగ్గరే ఉందని, రాష్ట్ర బడ్జెట్ ను వెంటనే సవరించి విద్యారంగానికి 20శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు పి మహేష్, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు శ్రీకాంత్, నాగరాజుతోపాటు 70 మంది అరెస్ట్ అయ్యారు.

పట్టణంలో ప్రమాదకరంగా కల్వర్టులు

- సెంట్రల్ లైటింగ్లు



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణం లోని 36వ వార్డ్ హుస్నాబాద్ కాలనీలో ప్రమాదకరంగా కల్వర్టులు, ప్రధాన వీధుల్లో సెంట్రల్ లైటింగ్ సమస్య తీవ్రంగా ఉందని బిజెపి పట్టణ అధ్యక్షులు మందుల బాలు శుక్రవారం అన్నారు. ఈ సందర్భంగా కల్వర్టును పరిశీలించి మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్లో సమస్యను వివరించారు. త్వరగా సమస్య పరిష్కరించాలని కోరారు. ప్రధాన వీధుల్లో సెంట్రల్ లైటింగ్ లేకపోవడం వల్ల దొంగతనాలు కూడా జరుగుతున్నాయని, ఇంతకుముందే ఈ కల్వర్టులో ఒక వ్యక్తి పడి గాయాలయ్యాయని అన్నారు. మున్సిపల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి త్వరగా సమస్యను పరిష్కరిస్తామని అన్నారని తెలిపారు. కార్యక్రమంలో కాందేశ్ ప్రశాంత్, దొండి ప్రకాష్, గుగులోత్ తిరుపతి నాయక్ ఉదయ్ గౌడ్ కాలనీవాసులు పాల్గొన్నారు.

నూతన అధ్యాపకులకు స్వాగతం



నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గాంధారి కాలేజీలో నూతనంగా విధుల్లో చేరిన హిందీ లెక్చరర్ శంబాజీ, సివిక్స్ లెక్చరర్ మమత ఇద్దరికి కామారెడ్డి జిల్లా తెలంగాణా గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్(475) తరుపున గ్రీన్ పెన్ బహుకరణ, సన్మాన కార్యక్రమం చేస్తూ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తమ కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం గంగారాం, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జెట్టి విజయ్, స్టేట్ కౌన్సిలర్ ఎస్.లక్ష్మణ్, వైస్ ప్రెసిడెంట్ రాజగోపాల్, శ్రీధర్, రమేష్, సుజాత, కాలేజీ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి



ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించినట్టు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా, ఎన్రోల్మెంట్, మార్పులు చేర్పులు, తొలగింపులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత జనవరి 1, 2024 నుండి ఇప్పటి వరకు జిల్లాలోని జుక్కల్, ఎల్లారెడ్డి, కామారెడ్డి మూడు శాసన సభ నియోజకవర్గాలలో ఫారం 6, 6ఎ, 7, 8 లు కలిపి 58,501 ఫారాలు అందగా వాటిని పరిశీలించి పలు కారణాల వలన 6310 ఫారాలు తిరస్కరించినట్టు తెలిపారు. 51,969 ఫారాలు ఆమోదించడం, మిగతా 222 ఫారాలు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. ఇందులో జుక్కల్ నియోజకవర్గంలోని 255 పోలింగ్ కేంద్రాల్లో 15611, ఎల్లారెడ్డి నియోజక వర్గంలోని 274 పోలింగ్ కేంద్రాల్లో 16,510, కామారెడ్డి నియోజకవర్గంలోని 266 పోలింగ్ కేంద్రాల్లో 26,304 దరఖాస్తులు అందాయని తెలిపారు. ఆయా ఈఆర్ఒలు వారి పరిధిలో పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించారని తెలిపారు. ఓటరు జాబితాలపై సలహాలు, సూచనలు అందించవచ్చని తెలిపారు. పార్టీల ప్రతినిధులు వారి పార్టీ తరపున బూత్ స్థాయి ఏజంట్లను నియమించాలని కోరారు. ఆయా బూత్‌లలో జరిగే విషయాలు బూత్‌స్థాయి ఏజెంట్లకు తెలియపరచడం జరుగుతుందని వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్, ఆర్డీఓ కే.వీణ, కామారెడ్డి తహసీల్దార్ జనార్ధన్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సరళ, నాయబ్ తహసీల్దార్ అనీల్, ఎన్నికల విభాగం సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రంలోకి ప్రైవేట్ పాఠశాల యాజమాన్యానికి అనుమతి

- విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన పదవ తరగతి పరీక్ష కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్ నిర్లక్ష్యం కారణంగా పరీక్ష కేంద్రంలోకి కనీసం విద్యార్థుల తల్లిదండ్రులను కూడా అనుమతించని అధికారులు.. ఒక ప్రైవేట్ స్కూలు యాజమాన్యాన్ని, సెల్ ఫోన్‌తో ఎలా అనుమతించారని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులను నిలదీశారు. ప్రైవేట్ స్కూలు యజమాని లోపలికి వెళ్లి వాళ్ళ స్కూల్ పిల్లలను అరేంజ్మెంట్ చేస్తూ అక్కడ ఉన్న ఇన్విజిలేటర్లతో మాట్లాడుతూ బయటకు వచ్చారు. ఒక ప్రైవేట్ స్కూలు యజమాని పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్ తీసుకొని లోపలికి అనుమతించినప్పుడు మమ్మల్ని ఎందుకు అనుమతించరని అక్కడున్న పరీక్షా కేంద్రం నిర్వాహకులను, పోలీసులతో విద్యార్థుల తల్లిదండ్రులు వాగ్వాదానికి దిగారు. పిల్లల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున గుమిగూడి ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాన్ని అలాగే అధికారులను నిలదీయడంతో ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం అక్కడి నుంచి హుటాహుటిన వెళ్లిపోయారు. పకడ్బందీగా నిర్వహించాల్సిన పదవ తరగతి పరీక్షలలో ఒక ప్రైవేట్ స్కూల్ యాజమాన్యానికి పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెంట్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్, ఇన్విజిలెటర్లు వత్తాసు పలకడం ఏంటని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

హ్యూమన్ ట్రాఫికింగ్‌పై అవగాహన

నవతెలంగాణ-జుక్కల్

హ్యూమన్ ట్రాఫికింగ్‌పై జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ కామారెడ్డి జిల్లా మానవ అభివృద్ధి విభాగం ఐకెపి ఆధ్వర్యంలో జుక్కల్ మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో ఒకరోజు శిక్షణ, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ గోవర్ధన్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీఓ రాము, ఐకెపి ఏపీఎం సత్యనారాయణ, సీసీలు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల డిమాండ్లు పరిష్కరించాలి

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశావర్కర్లు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆశావర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా పనులు నిర్వహించొద్దు



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బాన్సువాడ నియోజక వర్గంలో ఇష్టాను సారంగా పనులు నిర్వహించవద్దని కలెక్టర్‌కు బాన్సువాడ నియోజకవర్గ ప్రజలు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు మంజూరైన ఎన్ఆర్ఈజీఎస్ నిధులను గ్రామపంచాయతీలలో గ్రామసభలు నిర్వహించకుండా అదేవిధంగా ఏజెన్సీల నిర్ణయించే విధానాలను కూడా గ్రామసభల తీర్మానం చేయకుండానే నిర్ణయాలను నిబంధనలకు విరుద్ధంగా పనులు కేటాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కూనీపూర్ గ్రామాభివృద్ధికి రూ.40 లక్షలు మంజూరు

నవతెలంగాణ-వర్ని

మండలంలోని కూనీపూర్ గ్రామాభివృద్ధికి ఎస్ఆర్ఈజిఎఫ్ నిధులు రూ.40 లక్షలు మంజూరు అయినట్లు గ్రామ ప్రత్యేక అధికారి ఎంపీవో మారుతి తెలిపారు. నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణం కోసం రూ.20 లక్షలు, శివాలయం దగ్గర సిసి ప్లాట్‌ఫాం రోడ్డు రూ.15 లక్షలు, కూనీపూర్ క్యాంపులో డ్రైనేజీ కోసం రూ.5 లక్షల నిధులతో పనులకు



ఆయన భూమిపూజ చేశారు. పిసిసి డెలిగేట్ డాక్టర్ రాజారెడ్డి మాట్లాడుతూ.. కూనీపూర్ గ్రామానికి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ సురేష్ షెట్కార్ ప్రత్యేక శ్రద్ధ వహించి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రూ.65 లక్షల వరకు గ్రామాభివృద్ధికి మంజూరు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సౌజన్య, కాంతయ్య, కుటుంబరావు, సాయగౌడ్, గీరయ్య, రామచంద్రరెడ్డి, పంతులు రామ్‌శంకర్, కేశవ్, ప్యాట్ల సాయిలు, మొగులయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కమిషనర్ ఆకస్మికంగా తనిఖీలు



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాదు పోలీస్ కమీషనర్ పి. సాయి చైతన్య నగరంలో పలు పోలీస్ కార్యాలయంలలో ఆకస్మికంగా పర్యవేక్షణ నిర్వహించారు. భరోసా సెంటర్,షీ టీమ్ కార్యాలయం,పోలీస్ ఫిల్లింగ్ స్టేషన్, సౌత్ రూరల్ ఆఫీస్ లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ ఆ కార్యాలయంలో రికార్డ్ లను చూసారు. అక్కడ గల సిబందితో క్షుణ్ణంగా అన్నీ వివరాలు అడిగితే లుసుకున్నారు. సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.